[illegible]

13481

శ్రీ

సుమతిశతకము

టీకాతాత్పర్య విశేషార్థ సహితం

ఇయ్యది

గుంటూరు కాలేజి తెలుగు పండితులు

గుండు రాఘవదీక్షితులు గారిచే

వ్రాయబడినది

పబ్లిషర్సు:

మారుతీ రాం అండ్ కో.

బుక్కు సెల్లర్సు, బెజవాడ.

వాణీ ప్రెస్, బెజవాడ.

సర్వస్వామ్య సంకలితము. వెల 0-2-6.

[illegible]

[illegible] I II [illegible]	0—[illegible]—0
డిటో III [illegible]	0—[illegible]—0
[illegible] పద్యములతో [illegible]	0—[illegible]—0
[illegible] I	0—14—0
డిటో II	0—[illegible]—0
[illegible] చరిత్ర	0—12—0

నాటికలు.

[illegible] విజయం [illegible]	0—8—0
గయోపాఖ్యానం డిటో	0—8—0
ప్రహ్లాద డిటో	0—8—0
[illegible] డిటో	0—8—0
[illegible] విజయం [illegible] హరిశ్చంద్ర డిటో	0—8—0
నలచరిత్ర	0—8—0
రుక్మాంగద తెక ఏకాదశీమహాత్మ్యం	0—8—0
ద్రౌపదీ మానసంరక్షణము	0—[illegible]—0
దయాకరవిజయం	0—8—0
సూరదాసు చరిత్ర	0—8—0

నాటకములు.

చింతామణి నాటకం	1—8—0
హరిశ్చంద్ర [illegible]	1—0—0
[illegible] 1 [illegible]	0—14—0
[illegible] డిటో	0—12—0
గయోపాఖ్యానం [illegible] పద్యములతో [illegible]	0—[illegible]—0
[illegible] డిటో	0—[illegible]—0
[illegible] డిటో	0—[illegible]—0
[illegible]	1—0—0

[illegible]
[illegible]

ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు.

1. ఇదివఱకు టీకలతో నచ్చువేయఁబడియున్న సుమతి శతకములయందుఁగాని లేని విపులముగను వివరణసహితముగను అర్థములు వ్రాయఁబడినవి.

2. పద్యములు వేఱువేఱుశీర్షికలక్రింద విభజింపఁబడినవి.

3. బాలురకుఁగాని బాలికలకుఁగాని బోధింపఁదగిన పద్యములు ముందు వ్రాయఁబడినవి. తరువాతఁ బాఠశాలలయందు బోధింపఁగూడని పద్యములు వ్రాయఁబడినవి.

4. అర్థవివరణము లెంతవఱకుండవలయునో అంతవఱకే నవీనబోధనాపద్ధతుల ననుసరించి వ్రాయఁబడినవి.

5. విశేషాంశములు ఉపాధ్యాయులకొఱకు వ్రాయఁబడినవి కనుక బాలురచేఁ జదివింప నక్కఱలేదు.

6. బాలురకర్థములకు పదములకు టీక వ్రాయలేదు.

7. పద్యములను బోధించునపుడు వాక్యములు వాక్యములుగఁ జదివి బాలురే యర్థము చేసికొనునట్లు సహాయము చేయవలయును. పద్యములకు మొత్తముమీఁద అర్థము చేసికొనుట

అవసరముగాని పద్యమునందలి ప్రతిపదమునకును నైఘంటిక టీక నేర్పుకొనుట చిన్నతరగతులయందు తగునవసరములేదు. చిన్నతరగతులయందు సూక్ష్మములగు సంధులను విడఁదీయింపనక్కఱలేదు.

8. పద్యముల తాత్పర్యమును బాలురు తమ సొంతమాటలతోఁ జెప్పునట్లలవాటు చేయవలెను గాని పుస్తకమునందలి వాక్యము లప్పజెప్పరాదు.

9. పద్యమును జదువునపుడు ఏవాక్యమున కావాక్యమును విడదీసి చదువునట్లును, వ్రాయునపుడు ఏపాదమున కాపాదము చివరనాపి వ్రాయునట్లును మొదటినుండియు నేర్పవలయును.

10. అర్థములు చెప్పునపుడు బాలురు తమ సొంతమాటలతోఁ జెప్పలేని ప్రోత్సాహపఱుపవలసినదేగాని, పుస్తకమునందలి అర్థము చెప్పలేదని యనరాదు.

ఇందలి పొరపాటులను సవరించి నాకుఁ దెలుప వేఁడుచున్నాను.

గుంటూరు,
23—1—22.

గుండు రాఘవదీక్షితులు.

విషయసూచిక.

1. ప్రతిజ్ఞ
2. కూడనిపనులు
3. మంచియూరు
4. కొలువు
5. ప్రపంచమునలేనివి
6. స్నేహము
7. చుట్టములు
8. మంత్రి
9. రాజు
10. భాగ్యము
11. కులకాంత
12. స్వభావము
13. పుత్త్రుడు
14. కరణము
15. వివిధవిషయములు
16. భోధింపగూడని పద్యములు

శ్రీ

సుమతిశతకము.

ప్రతిజ్ఞ.

శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకలజనులు ♦ నౌరా! యనఁగా
ధారాళమైన నీతులు
నోరూరఁగఁ జవులుపుట్ట ♦ నుడివెదసుమతీ.

టీ॥ సుమతీ=ఓ మంచి బుద్ధిగలవాఁడా! శ్రీరాముని దయచేతను, ఆరూఢిగన్=స్పష్టముగను, సకలజనులు = అందఱును, ఔరాఅనఁగాన్ = ఔరా, అని యాశ్చర్యపడునట్లుగను, నోరూరఁగన్=నోరూరునట్లును, చెవులు పుట్టన్=క్రొత్తక్రొత్త రుచులు కలుగునట్లుగను, ధారాళము, ఐన, నీతులు= ఆటంకములేని నీతులను, నుడివెదన్=చెప్పెదను.

తాత్పర్యము॥ అందఱును మెచ్చుకొనునట్టియు, వినఁగ వినఁగ నోరూరునట్టియు, క్రొత్తక్రొత్త రుచులు పుట్టఁజేయునట్టియు, బహిరంగమగు నీతులను, శ్రీరాములవారి దయచేతఁ జెప్పెదను. మంచిబుద్ధిగలవాఁడా వినుము.

విశేషాంశములు॥ ప్రతివానికిని మంచివాఁడనిపించు కొనవలెనను కోరిక యుండును గనుకను, సంతోషము కలుగు విధమునఁ బిలిచి చెప్పినచోఁ దాను చెప్పఁబోవు విషయము తప్పక వినును గనుకను సుమతీయని పిలచి చెప్పుచు న్నాఁడు. తాను జెప్పఁబోవు నీతు లెట్లుండునోయని వినువారికి సందేహము కలుగునేమోయని ముందుగనే సకలజనులు నౌరాయనఁగా, నోరూరఁగఁ, జేవులుపుట్ట నని చెప్పి వినవలయునను ఆశపుట్టించుచున్నాఁడు. ఇట్లు చెప్పెద ననినఁ దనను దాను పొగడుకొనుచుండినటులఁ గనుపించునేమోయని శ్రీరాముని దయచేతఁ జెప్పఁగలుగుచున్నాను గాని నాప్రజ్ఞయేమియులేదుసుమా యని తెలుపుచున్నాఁడు. ఈనీతులను వీరు వినవచ్చును, వీరు వినరాదు అనుమాట లేకుండ ధారాళమైన నీతులని చెప్పి సకలజనులకుఁ బనికివచ్చునీతులని తెలియఁ జేయుచున్నాఁడు.

కూడనిపనులు.

క. అక్కఱకు రానిచుట్టము
మ్రొక్కిన వరమీనివేల్పు • మోహరమునఁ దా
నెక్కినఁ బాఱనిగుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయుఁ • గదరా సుమతీ. 2

టీక॥ సుమతీ, అక్కఱకున్, రాని, చుట్టము=అవసరము వచ్చినపుడు సహాయముచేయని చుట్టము, మ్రొక్కినన్, వరము, ఈని, వేల్పు=మ్రొక్కుకొనినపుడు వరములు ఇయ్యనిదేవుఁడు, మోహరమునన్ = యుద్ధమునందు, తాన్=తాను, ఎక్కినన్=ఎక్కఁగా, పాఱని=పరుగెత్తని, గుఱ్ఱము, వీనిని, గ్రక్కునన్ = త్వరగా, విడువంగవలయున్, కదరా = విడిచివేయవలెను సుమా.

తా॥ అవసరమువచ్చినపుడు సహాయముచేయని చుట్టమును, మ్రొక్కికొనినపుడు వరములియ్యని దేవుని, యుద్ధములో నెక్కినపుడు పరుగెత్తని గుఱ్ఱమును, వెంటనే విడిచిపెట్టవలెను.

విశే॥ మ్రొక్కినవరమీని వేల్పు-ఇచట భక్తితో మ్రొక్కుకొనుట యని బోధింపనగును. గ్రక్కున అనుటచేతఁ గొంతకాలమాలస్యముచేసినచో నష్టము కలుగునని చెప్పవలెను. ఆయావాక్యముల నుదాహరణములతోఁగూడ వివరించునది.

క. అడియాస కొలువుఁగొలువకు
గుడిమణియము సేయఁబోకు ♦ కుజనులతోడన్
విడువక కూరిమిసేయకు
మడవినిఁ దోడరయ కొంటి ♦ నరుగకు సుమతీ. 3

అడియాసకొలువున్=ఇంకను ముందుముందు లాభించునను ఆశనుగలిగించెడికొలువును, కొలువకు=కొలువవద్దు. (అనఁగా నెప్పుడో ముందు లాభించునని యాశపెట్టు నుద్యోగముచేయవద్దు.) గుడిమణియము సేయఁబోకు=దేవాలయముయొక్క పెత్తనము చేయవద్దు. కుజనులతోడన్ = దుర్మార్గులతో, విడువక=విడిచిపెట్టకుండ, కూరిమిచేయకుము = సహవాసము చేయకు. అడవిని=అడవియందు, తోడు, అరయక=తోడువచ్చువారిని, విచారించుకొనక, ఒంటిన్=ఒంటరిగ, అరుగకు=వెళ్ళకుము.

తా॥ అప్పటికి లాభములేనట్టియు, ముందెన్నఁడో లాభించునని యాశపెట్టునట్టియు నుద్యోగమును చేయవద్దు. దేవాలయపు అధికారమును పొందరాదు. దుర్మార్గులతో ఎల్లప్పుడును విడువకుండ సహవాసము చేయరాదు. అడవిలోఁ బ్రయాణము చేయునప్పుడు తోడులేకుండ నొంటరిగ వెళ్ళరాదు.

విశే॥ దేవాలయపు అధికారమును పొందినయెడల పొరపాటున నైనను దేవునిసొమ్ము వాడుకొందురనియు అందుచేత నరకము కలుగుననియు దేవాలయముమీఁద నధికారము పొందరాదని చెప్పఁబడినది. దుర్మార్గులతోఁగూడ

ఒక్కొక్కప్పుడు పనికలుగవచ్చును. అట్టి సమయములయందు వారివల్ల కాఁదగినపనులు చేయించుకొనవచ్చును. కాని అదేపనిగ వారితో స్నేహముచేయరాదు. అందుచేతనే విడువక కూరిమిసేయకుము అని చెప్పఁబడినది. అట్టివారిని ద్వేషింపుఁడని చెప్పలేదు. కనుక వారితో విరోధము పెట్టుకొననవసరము లేదు.

క. ఏఱకుమీ కసుగాయలు
దూఱకుమీ బంధుజనుల ♦ దోషము సుమ్మీ
పాఱకుమీ రణమందున
మీఱకుమీ గురువులాజ్ఞ ♦ మేదినిసుమతీ. 4

టీక॥ ఏఱకుమీ కసుగాయలు=లేఁత కాయలను ఏఱకుము. బంధుజనులన్=చుట్టములను, దూఱకుమీ=దూషింపకుము. (అట్లుదూఱుట) దోషము సుమ్మీ=దోషముసుమా. రణమందునన్=యుద్ధమునందు, పాఱకుమీ=పరుగెత్తఁబోకుము. మేదినిన్=భూమియందు, గురువులాజ్ఞ=పెద్దలు చెప్పినమాటను, మీఱకుమీ=దాఁటిపోరాదుసుమా.

తా॥ మంచిబుద్ధిగలవాఁడా, లేతకాయలను ఏఱరాదు. చుట్టములను తొందరపడి దూషింపఁగూడదు. యుద్ధముచేయుచు విరోధులకు భయపడిపాఱిపోరాదు. పెద్దవారియాజ్ఞలను దాఁటిపోఁగూడదు.

వి॥ ఏఱుటయనఁగాఁ గ్రిందఁబడిన వస్తువులను దీసికొనుటయేగాని యిక్కడ చెట్టునఁగల కాయలనుండి లేఁతకాయల నేఱరాదని యర్థము. ఏలయన, దోరకాయలును, పండ్లును తినుటకుఁబనికివచ్చును. కాని లేఁతకాయలెందునకును బనికిరావు. గురువులనఁగా విద్యఁజెప్పు గురువులుమాత్రమేయని చెప్పుటకంటెఁ దల్లిదండ్రులు నన్నలుమొదలగు పెద్దలనుగూడఁజేర్చి పెద్దవారు అనునర్థము చెప్పుటయేమంచిది.

క. తనవారు లేని చోటను
జనవించుక లేనిచోట ♦ జగడముచోటన్
అనుమానమైన చోటను
మనుజునకును నిలువఁదగదు ♦ మహిలో సుమతీ. 5

టీక॥ సుమతీ, మహిలోన్=భూమియందు, తనవారు లేనిచోటను=తన క్షేమమును గోరుకొనువారు లేనిచోటను, జనవు, ఇంచుక, లేనిచోటన్=తనకు కొద్దిగానైనను అలవాటు పడినవారు లేనిచోటునందును, జగడము చోటన్=పోట్లాటలు జరుగుచుండు చోటను, అనుమానమైన చోటను=నమ్మకము చిక్కని చోటునందును, మనుజునకును=ఏమనుష్యునకును, నిలువన్, తగదు=ఉండరాదు.

తా॥ మనుష్యుఁడు తన క్షేమమును గోరుకొను వారు లేనిచోటనుగాని తనకు పరిచయము గలవారు లేనిచోటునందుఁగాని, ఎవరైనను పోట్లాడుకొను చుండు చోటఁగాని, తనకుఁ గష్టనష్టములు సంభవించునేమో యని యనుమానము కలిగిన చోటఁగాని ఉండఁగూడదు.

ఇ॰ శే॥ తనవారు అనఁగాఁ దనచుట్టములని మాత్రమే కాక తన క్షేమమును గోరుకొను వారెల్లరును దనవారేయని యర్థము చెప్పవచ్చును. జగడము చోటనఁగాఁ దనతో నితరులు జగడమాడుదురని తోఁచిన చోటునందు మాత్రమే కాక, ఇతరులు పోట్లాడు కొనుచుండు చోటునందుఁగూడ నుండఁదగదని చెప్పుట మంచిది.

క. పగవల దెవ్వరితోడను
వగవంగావలదు లేమి ♦ వచ్చినపిదపన్
తెగనాడవలదు సభలను
మగువకు మనసీయవలదు ♦ మహిలో సుమతీ. 6

టీక॥ సుమతీ, మహిలోన్=భూమియందు, ఎవ్వరితోడను=ఎటువంటి వారితోనైనను, పగవలదు=విరోధము కలిగించుకొనవద్దు, లేమివచ్చినపేదపన్ = పేదరికము వచ్చినతరువాత, వగవంగాన్ వలదు=దుఃఖపడవద్దు. సభలను=సభలయందు, తెగన్ ఆడన్ వలదు=ఇతరులమనస్సు నొచ్చునట్లు మాటలాడవద్దు. మగువకున్=స్త్రీకి, మనసు ఈయవలదు=మనసునందలి రహస్యమును చెప్పవద్దు.

తా॥ ఎవరితోనైనను విరోధము పెట్టుకొనవద్దు. పేదరికము వచ్చినప్పుడు చింతింపవద్దు. సభలలో నితరులకుఁగోపము వచ్చునట్లు ఏవిషయమునందును పట్టుదలగా మాటలాడవద్దు. స్త్రీలు రహస్యములనుదాఁచలేరు. కనుక వారితో రహస్యవిషయములను జెప్పరాదు.

విశే॥ తెగనాడవలదు అనఁగా మిక్కిలిగ మాటలాడవద్దు, అనియుఁజెప్ప వచ్చును. మగువకు మనసీయవలదు అనఁగాఁ క్రొత్తగఁ గాపురమునకువచ్చినట్టి యు ప్రపంచానుభవములేనట్టియు భార్యలతోడను రహస్యములు దాఁచరేమో యను అనుమానము కలిగినను. తల్లి, అక్కలు, మొదలగు మనక్షేమముగోరు స్త్రీలకు మనరహస్యములు చెప్పినను నష్టములేదు.

క. రూపించి పలికి బొంకకు
ప్రాపగుచుట్టంబు నెగ్గు ♦ పలుకకుమదిలోఁ
గోపించురాజుఁ గొల్వకు
పాపపుదేశంబు సొరకు ♦ పదిలము సుమతీ. 7

టీక॥ సుమతీ, రూపించి=ఋజువుచేయించి, పలికిబొంకకు=చెప్పిన దానిని అబద్ధమాడకు, ప్రాపు, అగు, చుట్టంబున్=అండగా నుండునట్టిచుట్టమును ఎగ్గు=అపకారముగా, పలుకకు=చెప్పకుము. మదిలోన్= మనస్సునందు, కోపించు=కోపముచెందునట్టి, రాజున్=రాజును, కొల్వకు=సేవింపవద్దు. పాపపుదేశంబున్=పాపములు చేయువారుండు దేశమును, చొరకు= ప్రవేశింపవద్దు. పదిలము=జాగ్రతగనుండుము.

తా॥ అబద్ధము, నిజమయినట్లుగ ఋజువుచేయించఁగలనని, కొక్కిరి వాదములాడకుము. నీకు సహాయము చేయుచు కనిపెట్టియుండెడి చుట్టమునకు అపకారము చేయ నెంచకుము. కోపముగల అధికారివద్ద కొలువుచేయవద్దు. పాపకార్యములు చేయువారలుండు ప్రదేశమునకుఁబోవద్దు.

విశే॥ అబద్ధమాడుటయే తప్పు. అందులోఁగూడ అబద్ధమును నిజమని చెప్పుచు దానిని ఋజువుచేయఁజూచుట మిక్కిలి తప్పు. అనిబోధించవలెను. ప్రాపగు చుట్టమునకే కాక కేవలము చుట్టమైనను, ఇతరుఁడైనను గూడ వానికిఁ గీడుతలఁపఁగూడదనియు, ప్రాపగు చుట్టమునకు గీడుతలఁచుట మిక్కిలి తప్పు అనియు బోధింపవలెను.

క. వఱదైనచేను దున్నకు
కఱవైనను బంధుజనుల ♦ కడకేఁగకుమీ
పరులకు మర్మము సెప్పకు
పిఱికికి దళవాయితనము ♦ పెట్టకు సుమతీ. 8

టీ॥ సుమతీ, వఱదైనచేను= వరదవచ్చెడిచేను, దున్నకు. కఱవైనను= కఱవుసంభవించినను, బంధుజనులకడకుఁ= చుట్టములదగ్గఱకు, ఏఁగకుమీ= వెళ్ళవద్దుసుమా. పరులకున్= ఇతరులకు, మర్మముసెప్పకు= రహస్యము చెప్పవద్దు. పిఱికికిఁ= పిఱికివానికి, దళవాయితనము= సేనపై అధికారము, పెట్టకు= ఇయ్యకొకుము.

తాత్ప॥ వరదలతో మునిఁగి యుండుచేను దున్నరాదు. కఱవుసమయమున బంధువులయిండ్లకు బోరాదు. ఇతరులకు రహస్యములను చెప్పరాదు. పిఱికివానికి సేనపైనధికారము నీయరాదు.

విశే॥ కఱవుసమయమునఁ దనకుటుంబమును బోషించుకొనఁజాలక చుట్టములయిండ్లకు వెళ్ళుట తనకు అవమానకరమును, చుట్టములకు భారమును గనుక వెళ్ళరాదు. పరులకు రహస్యములను జెప్పగూడదనుటచేత, తనమేలును గోరుకొనెడి యాప్తులకుఁ జెప్పవచ్చునని తెలియనగును.

క. స్త్రీలయెడ వాదులాడకు
బాలురతోఁ జెలిమిచేసి ♦ భాషింపకుమీ
మేలైన గుణమువిడువకు
మేలినపతి నిందసేయ ♦ కెన్నఁడు సుమతీ॥ 9

టీక. సుమతీ, స్త్రీలయెడన్ = ఆఁడువారివిషయమై, వాదులాడకు = పోట్లాడవద్దు. బాలురతోన్ = చిన్నపిల్లలతో, చెలిమిచేసి = స్నేహముచేసి, భాషింపకుమీ = మాటలాడవద్దుసుమా. మేలు, ఐన, గుణము = మంచిది, ఐనట్టి, గుణము, విడువకుము = విడిచిపెట్టవద్దు. ఏలినపతిన్ = అధికారిగనుండిన యజమానుని, ఎన్నడున్ = ఎప్పటికిని, నిందసేయకు = దూషింపఁగూడదు.

తాత్ప॥ స్త్రీలవిషయమై పోట్లాడఁగూడదు. చిన్నపిల్లలతో స్నేహము చేసిమాటలాడఁగూడదు. మంచిగుణములను విడిచిపెట్టరాదు. నీపైయధికారి నెన్నఁడును దూషింపఁగూడదు.

విశే॥ ఏలినపతి యనఁగా ప్రస్తుతమునందైనను, పూర్వమునందైనను మనకుయజమానుడుగనుండిన యధికారి. ఎన్నఁడు అని చెప్పుటచేత, మనమాతని కొలువునందు ప్రస్తుతములేకున్నను, మనకును అతనికిని స్నేహముచెడియున్నను గూడనతని దుర్గుణములను పరులకుఁ జెప్పిదూషింపఁగూడదు.

క. అప్పిచ్చువాఁడు వైద్యుఁడు
నెప్పుడు నెడతెగక పాఱు ♦ నేఱును ద్విజుఁడున్
జొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టియూరఁ ♦ జొరకుము సుమతీ॥ 10

టీక. సుమతీ, అప్పు, ఇచ్చువాఁడు = అప్పుగా పైకముగాని మఱియొకటిగాని ఇచ్చువాఁడును, వైద్యుఁడు = వైద్యముచేయఁగలవాఁడును, ఎప్పుడున్ = ఎల్లప్పుడును, ఎడతెగక = విడువక, పాఱు = ప్రవహించుచుండు, ఏఱును = నదియును, ద్విజుఁడున్ = బ్రాహ్మణుఁడు, క్షత్రియుఁడు, కోమటి — ఈమూఁడు

వర్ణములవారును, చొప్పడిన=(చొప్పు, పడిన)=దొరకిన, ఊరన్=ఊరియందు, ఉండుము=కాఁపురముండుము. చొప్పడకున్నట్టి (చొప్పు, పడక, ఉన్నట్టి)=దొరకనట్టి, ఊరు=గ్రామమును, చొరకుము=ప్రవేశింపనైనవద్దు.

తాత్ప॥ అవసరమునకుఁ గావలసిన వస్తువులను అప్పుగనైన నిచ్చువాఁడును, జబ్బుపడినప్పుడు మందియ్యఁగల వైద్యుఁడును, చక్కని నీటివసతియు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులును గల యూరియందుఁ గాఁపురముండవలెను. ఈవసతులులేని యూరియందుఁ గాఁపురముండఁగూడదు.

వి శే॥ అప్పిచ్చువాఁడు=డబ్బుమాత్రమే కాక ధాన్యాదులుకూడ అప్పిచ్చుట, మొదలగు విషయములు చెప్పవలెను. ఏఱు=ఇది పద్యమునందలి పాదపూరణముకొఱకు వేయఁబడిన మాటయేగాని, ఎడతెగని నీటివసతియని యర్థము చెప్పవలెను. లేనిచో గుంటూరు మొదలగు ఏఱులేని గ్రామములను విడిచి వేయవలెనని యర్థము స్ఫురించును. ద్విజుఁడనఁగా బ్రాహ్మణుఁడు మాత్రమే కాదు. శుభాశుభకార్యముల విషయమయి సలహాలు చెప్పుటకును, చేయించుటకును బ్రాహ్మణులును, గ్రామస్థులను పరిపాలించుటకును, వారి ప్రాణమానధనాదులను రక్షించుటకును క్షత్రియులును, వ్యవసాయము, వర్తకము మొదలగునవి చేసి ఎవరికేఁగావలసినవి వారి కందించుచుండుటకు వైశ్యులును అవసరముగ నుండవలసినవారే. ద్విజులనఁగా నుపనయనార్హతగల యీమూఁడువర్ణముల వారికిని జెందును. కనుక నీయర్థమే గ్రహింపఁదగినది.

క. అడిగిన జీతంబియ్యని
మిడిమేలపు దొరనుగొల్చి ♦ మిడుగుట కంటెన్
వడిగల యెద్దులఁ గట్టుక
మడిదున్నుక బ్రదుకవచ్చు ♦ మహిలో సుమతీ. 11

టీక॥ అడిగినన్=అడుగఁగా, జీతంబున్ ఇయ్యని=జీతమును, ఇయ్యనట్టి, మిడిమేలపు దొరను=మిడిసిపాటు అధికారిని, కొలిచి=సేవించి, మిడుకు

కుటకంటెన్=చిక్కులు పడుటకంటె, వడిగల యెద్దులన్=చురుకు దనముగల యెద్దులను, కట్టుక=సంపాదించుకొని, మడిదున్నుక=పొలమును వ్యవసాయము చేసికొని, మహిలోన్=భూమియందు, సుమతీ=మంచిబుద్ధి గలవాడా, బ్ర దుకవచ్చున్=బ్రదుకవచ్చును.

తా॥ కొలువుచేసి జీతమడిగి నప్పుడు ఇయ్యనట్టి దుర్మార్గుని సేవించు చు, కష్టములు పడుటకంటె, దిట్టమైన రెండెద్దులను సంపాదించి వ్యవసాయ ముచేసికొని సుఖముగా జీవింపవచ్చును.

విశే. దొర అనఁగా అధికారి, లేక యజమానుఁడు అని అర్థముగాని తెల్లవాఁడు అని మాత్రమే అర్థముకాదు.

క. అధరము కదిలియుఁ గదలక
మధురములగు భాషలుడిగి • మౌనవ్రతుఁడౌ
నధికారరోగ పూరిత
బధిరాంధకశవముఁ జూడఁ • బాపము సుమతీ. 12

టీక. సుమతీ, అధరము=క్రిందిపెదవి, కదిలియున్. కదలక=ఆడియుఁ ఆడకుండ, మధురములు=తియ్యనగు, భాషలు=మాటలు, ఉడిగి=విడిచిపెట్టి, మౌనవ్రతుఁడు, ఔ=మాటలాడనని నియమము పట్టునట్టి, అధికార...శవమున్ అధికార=అధికారమనెడి, రోగ=రోగముచేత, పూరిత=నిండిన, బధిర=చెవిటివాఁడైనట్టియు, అంధక=గ్రుడ్డివాఁడైనట్టియు, శవమున్=పీనుఁగును, చూడన్=చూచుట, పాపము=పాపము వచ్చుపని.

తా॥ మాటలాడినట్లు కనబడకుండ మనోహరములగు తియ్యని మాటలను మాటలాడుట వదలిపెట్టి, మునీశ్వరునివలె నోరుకదల్పక ఉండునట్టియు, అధికారమనేరోగము వంటినిండ ఆవరించుటచేత చెవుడు గ్రుడ్డితనము కలిగి యున్న అధికారి పీనుఁగును కండ్లతోఁ జూచుటకూడ పాపమేయగును.

వి శే॥ కొందఱధికారులు, తమకుగల అధికారగర్వముచేత నితరులమాటలు వినరు. ఇతరుల కష్టములను జూడజాలరు. అటువంటి అధికారుల దగ్గఱ నున్నప్పుడు బోవుటకూడఁ దప్పైయగును. అని వివరింపఁబడెను.

క॥ ఎప్పుడు దప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వఁగూడ దది యెట్లన్నన్
సర్పంబు పడగ నీడను
గప్ప వసించిన విధంబు గదరా సుమతీ॥ 13

టీక॥ సుమతీ, ఎప్పుడున్ = ఎల్లప్పుడును, తప్పులు = తప్పులను, వెదకెడు = ఏఱుచుండెడు, ఆ పురుషునిన్ = అటువంటిస్వభావము గలవానిని, గొల్వన్ గూడదు = సేవింపరాదు. అదియెట్లన్నన్ = కూడకపోవుట యెట్లనఁగా, సర్పంబు, పడగనీడను = పాముయొక్క పడగక్రిందను, కప్పవసించినవిధంబు, గదరా = కప్ప కాపురము చేయుటవలెనే సుమా.

తాత్ప॥ పాము పడగక్రింద కప్ప కాఁపురము చేయుట యెట్లు మోసకరమో అట్లే ఎల్లప్పుడును తప్పులను వెదకుచుండెడు అధికారిక్రిందఁ గొలువుచేయుట కూడ మోసకరము.

క॥ మానఘనుఁ డాత్మధృతి చెడి
హీనుండగువాని నాశ్రయించుట యెల్లన్
మానెడు జలముల లోపల
నేనుఁగు మెయి దాఁచినట్లు లెఱుఁగుము సుమతీ॥ 14

టీక॥ సుమతీ, మానఘనుఁడు = గొప్ప పౌరుషముగలవాఁడు, ఆత్మన్ = మనస్సునందు, ధృతిచెడి = ధైర్యముచెడిపోయి, హీనుండగువానిన్ = తనకంటె తక్కువగు వానిని, ఆశ్రయించుటలు, ఎల్లన్ = అనుసరించుకొని యుండుట, మానెడు జలములలోపలన్ = ఒకమానెఁడు నీళ్ళలో, ఏనుఁగు మెయి, దాఁచిన

ట్టులు—ఏనుఁగు తనశరీరమును ముంచివేసినంత కష్టమని, ఎఱుఁగుము = తెలిసి కొనుము.

తా॥ పౌరుషముగల గొప్పవాఁడు స్థితిచెడి హీనుని ఆశ్రయించుకొని యుండుట మానెడు నీళ్ళలో ఏనుఁగు దాఁగియుండుటంత కష్టమగుపని.

క॥ రా పొమ్మని పిలువని యా
భూపాలునిఁ గొల్వ ముక్తి • భుక్తులు గలవా?
దీపంబు లేనియింటను
జేపుణికిళ్ళాడినట్లు • సిద్ధము సుమతీ॥ 15

టీక॥ సుమతీ, రా=రావలసినది, పొమ్మ,అని = పోవలసినది,అని, పిలువని=మర్యాదలుచేయని, ఆ భూపాలుని,కొల్వన్ = ఆరాజును సేవించుటచేత, ముక్తి=స్వర్గలోకసుఖముగాని, భుక్తులు=భూలోక సౌఖ్యములుగాని, కలవా?=ఉన్నవా? అకొలువు, దీపంబులేని యింటను=చీఁకటింటిలో జేపుణికిళ్ళు,ఆడినట్లు = చేతులుతట్టుచు ఆడుకొను ఆటలాడుకొనిన విధము. సిద్ధము = ఇది నిశ్చయము.

తా॥ చీఁకటింట్లో ఆటలాడుకొన్నయెడల నెట్లు సంతోషకరముగా నుండదో అట్లే, మర్యాదలుచేయని యజమానునియొద్దఁ గొలువుచేయుటకూడ, భూలోకమునఁగాని పరలోకమునఁగాని సౌఖ్యము నీయఁజాలదు.

స్వభావము

క॥ అల్లుని మంచితనంబును
గొల్లని సాహిత్యవిద్య • కోమలినిజమున్
బొల్లున దంచిన బియ్యముఁ
దెల్లని కాకులును లేవు • తెలియర సుమతీ॥ 16

టీక॥ సుమతీ, అల్లుని=అల్లునియొక్క, మంచితనంబును = మంచితనమును, గొల్లని=గొల్లవానియొక్క, సాహిత్యవిద్య=పాండిత్యమును, కోమలి నిజముగ్=ఆఁడుదాని మాటలలోనిజమును, పొల్లునక్=గింజలుపట్టని ధాన్యములో, దంచిన=దంచితీసిన, బియ్యముగ్=బియ్యమును, తెల్లని కాకులును = తెల్లనిరంగుగానుండు కాకులును, లేవు, తెలియరా=లేవనియెఱుఁగుము.

తా॥ ఎంత మంచిగానున్నను అల్లుని మంచితనము కనిపించదు. ఎంత చదువుకొన్నను గొల్లవానికి సాహిత్యము కలుగదు. ఎంతనమ్మకముచూపి చెప్పినను స్త్రీలమాటలు నమ్మకములుగాఁ దవు. ఎంతశ్రమపడినను గింజలేపట్టని ధాన్యమునుండి బియ్యమురావు. తెల్లని కాకులు ఎచటను గనుపించవు.

విశే॥ సాహిత్యము కొంతకాలము పాటుచదువుకొనిన తరువాత, చదువుకొనని గ్రంథములనుగూడ నర్థము చేసికొనఁగల పాండిత్యము సాహిత్యము అనఁబడును.

క॥ ఉపమింప మొదలు తియ్యన
కపటంబెడ నెడను జెఱకు ♦ కైవడి నేపో
నెపములు వెదకును గడపటఁ
గపటపు దుర్జాతిపొందు ♦ గదరా సుమతీ॥ 17

టీక॥ సుమతీ, కపటపు దుర్జాతిపొందు=కపటముగల దుర్మార్గునితో స్నేహముచేయుట, చెఱకుకైవడి నేపో=చెఱకువలెనే సుమా. ఎట్లనఁగా, ఉపమింపగ్=సాటిపెట్టుటకు, మొదలుతియ్యన=మొట్టమొదట తియ్యఁదనమును, ఎడగ్, ఎడను=మధ్యమధ్యను, కపటంబు=కపటము, కడపటగ్=చివరకు, నెపములు వెదకును = నేరములు ఎంచును.

తాత్ప॥ మొదట ప్రేమయు, మధ్యమధ్య కపటమును, తుదకు నేరములను వెదకుటయు దుర్మార్గుని సహవాస లక్షణము. దీనిని మొదట తీపియు, మధ్యమధ్య చప్పఁదనమును వేళ్ళవద్ద చేఁదును గల చెఱకుయొక్క రుచులతోఁ బోల్పవచ్చును.

ప్రేమ.

క॥ కూరిమిగల దినములలో
నేరము లెన్నఁడును గలుగ • నేరవు మఱియా
కూరిమి విరసంబైనను
నేరములే తోఁచుచుండు • నిక్కము సుమతీ॥ 18

టీక॥ సుమతీ, కూరిమి=ప్రేమ, కల, దినములలోన్=ఉన్న దినముల యందు, నేరములు=తప్పిదములు, ఎన్నఁడును, కలుగ నేరవు=ఎప్పటికిని కనఁబడవు. మఱి=ఇఁకను ఆ, కూరిమి=ఆ, ప్రేమ, విరసంబు, ఐనను=చెడిపోయినయెడల, నేరములే=తప్పులుమాత్రమే, తోఁచుచుండున్=కనఁబడుచుండును. నిక్కము=ఇదినిశ్చయము.

తాత్ప॥ ప్రేమయుండినపుడు నేరములు కనిపించవు. ప్రేమలేనపుడు అన్నియు నేరములే కనఁబడుచుండును.

క॥ కొంచెపు నరుసంగతిచే
నంచితముగఁ గీడువచ్చు • నదియెట్లన్నన్
గించిత్తు నల్లికుట్టిన
మంచమునకుఁ బెట్లువచ్చు • మహిలో సుమతీ॥ 19

టీక॥ సుమతీ, మహిలోన్=భూమియందు, కొంచెపునరు=నీచునియొక్క, సంగతిచేన్=సహవాసముచేత, అంచితముగన్=ఒప్పునట్లుగ, కీడు=హాని, వచ్చున్=వచ్చును. అది=ఆకీడువచ్చుట, ఎట్లన్నన్=ఎట్లనఁగా, కించిత్తు=కొద్దిగా, నల్లికుట్టినన్=కుట్టినయెడల, మంచమునకున్=మంచమునకు, పెట్లు, వచ్చున్=దెబ్బలువచ్చును.

తాత్ప॥ మనుష్యులను నల్లులుకుట్టగానే మంచమునకు దెబ్బలువచ్చును. అట్లే నీచులతో సహవాసముచేయు మంచివారికిఁగూడ కష్టములువచ్చును.

వి॥ ఈ పద్యమునందు నల్లులు నీచులతోడను, మంచములు మంచి వారితోడను, మంచమునకు దెబ్బలు మంచివారికివచ్చు కష్టములతోను పోల్పఁబడినవి. మంచమున నల్లులుండుట మంచములు నల్లులతో సహవాసము చేయుట యని చెప్పఁబడినది. బాలుర కీపద్యము చక్కఁగా వివరింపవలెను.

క॥ పాలనుగలసిన జలమును
పాల విధంబుననెయుండుఁ ♦ బరికింపంగాఁ
బాలచవిఁ జెఱుచుఁగావునఁ
బాలసుఁడగు వానిపొందు ♦ వలదురసుమతీ॥ 20

టీక॥ సుమతీ, పాలను=పాలయందు, కలిసిన, జలమును=నీళ్ళుకూడ, పరికింపఁగాన్=పరీక్షించిచూడఁగ, పాలవిధంబుననె, ఉండున్=పాలవలె నెయుండును. కాని, పాలచవిన్=పాలయొక్కరుచిని, చెఱుచున్ = చెడఁ గొట్టును, కావునన్=కాఁబట్టి, పాలసుఁడు, అగువాని పొందు=దుర్మార్గు డగు వాని సహవాసము, వలదుర=వద్దుసుమా.

తాత్ప॥ పాలలోఁగలిసిన నీళ్ళు పాలరుచిని చెడఁగొట్టినట్లే, మంచివారి లోఁగలిసి తిరిగెడి దుర్మార్గులు మంచివారిని చెడఁగొట్టుదురు. కనుక చెడువారితో స్నేహము చేయఁగూడదు.

క॥ చుట్టములు గానివారలుఁ
జుట్టములము నీకటంచు ♦ సొంపుదలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబుగలుగఁ ♦ గదరా సుమతీ॥ 21

టీక. సుమతీ, గట్టిగన్=ఎక్కువగా, ద్రవ్యంబు=డబ్బు, కలుగన్= ఏర్పడగనే, చుట్టములు కానివారలున్=చుట్టరికము లేనివారుకూడ, చుట్టము

లము, నీకు, అటంచున్=నీకు మేము చుట్టములమని చెప్పుకొనుచు, సొంపు=మంచితనము, తలిర్పన్=ఒప్పునట్లు, చెట్టుకొని=దగ్గఱబంధువులవలె సమీపమునకు చెట్టుకొనివచ్చి, ఆశ్రయింతురు కదా=కనిపెట్టుకొని యుందురు కదా.

తాత్ప॥ మనవద్దకు డబ్బు దిట్టముగఁ జేరఁగనే బంధువులు కానివారు గూడ నేదోయొక చుట్టరికము కల్పించుకొని సమీపమున సంచరింపుచుందురు.

క॥ మండలపతి సముఖంబున
మెండయిన ప్రధాని లేక ♦ మెలఁగుట యెల్లన్
గొండంత మదపుటేనుఁగు
తొండము లేకుండినట్లు ♦ తోఁచుర సుమతీ॥ 22

టీక॥ సుమతీ, మండలపతి, సముఖంబునన్=రాజుదగ్గర, మెండు, అయిన=దిట్టమైన, ప్రధాని=మంత్రి, లేక=ఉండక, మెలఁగుట, ఎల్లన్=సంచరించుట అంతయును, కొండంత=కొండవలె పెద్దదిగనున్న, మదపుటేనుఁగు=బలముగలయేనుఁగు, తొండములేకుండినట్లు, తోఁచుర = తొండము లేకుండిన ఎట్లుండునో అట్లుకనఁబడును సుమా.

తాత్ప॥ ఏనుఁగునకు తొండము లేకపోవుట ఎంతలోపమో, రాజునొద్ద తెలివిగల మంత్రి లేకపోవుటకూడ అంతలోపము.

క॥ మంత్రిగలవాని రాజ్యము
తంత్రము లేకుండ నిలుచుఁ ♦ దఱుచుగ ధరలో
మంత్రివిహీనుని రాజ్యము
జంత్రపుఁగీలూడినట్లు ♦ జరుగదు సుమతీ॥ 23

టీక॥ సుమతీ, ధరలోన్=భూమియందు, మంత్రిగలవానిరాజ్యము=మంత్రిగలుగున్న రాజుయొక్క రాజ్యము, తంత్రములేకుండన్ = మోసములు

లేకుండ, నిలుచుక్ = నిలిచియుండును. అనఁగాఁ జాలకాలమువఱకుఁ జెడకుండ నుండును.

మంత్రిపిహీనుని రాజ్యము=మంత్రియొక్క ఆలోచనలు తీసికొనని రాజుయొక్క రాజ్యము, జంత్రపుఁగీలూడినట్లు యంత్రములోనుండు మరలు ఊడిపోయినట్లుగా, జరుగదు=చాలకాలమువఱకు నిలిచియుండదు.

తాత్ప॥ రాజులు మంత్రులయొక్క ఆలోచనలను తీసికొనుచుండినచో వారిరాజ్యము క్షేమముగాఁ జాలకాలమువఱకు నిలిచియుండును. ఏరాజులు మంత్రుల యాలోచనలు వినరో వారిరాజ్యము మరలూడిపోయిన యంత్రము వలెనె చాలకాలమువఱకు నిలిచియుండదు.

రాజులు

క. దగ్గఱఁ గొండెము సెప్పెడు
బ్రెగ్గడ పలుకులకు రాజు ♦ ప్రియుఁడై మతి తా
నెగ్గు ప్రజకాచరించుట
బొగ్గులకై కల్పతరువుఁ ♦ బొడుచుట సుమతీ. 24

టీక॥ సుమతీ, దగ్గఱక్ = సమీపమునందు, కొండెము=కొండీలను, చెప్పెడి - చెప్పునట్టి, ప్రెగ్గడ=మంత్రియొక్క, పలుకులకుక్=మాటలకు, రాజు ప్రియుఁడై=యిష్టపడినవాఁడై, మతి=ఇంకను, తాక్=తాను, ప్రజకు=జనులకు, ఎగ్గు=అపకారము, ఆచరించుట=చేయుట, బొగ్గులకై=బొగ్గులనిమిత్తము, కల్పతరువుక్=కల్పవృక్షమును, పొడుచుట=నఱకుట.

తా॥ దగ్గఱఁజేరి కొండెములుచెప్పు మంత్రిమాటలు విని రాజు ప్రజలకు అపకారము చేయుట బొగ్గులకొఱకై కల్పవృక్షమును నఱికి కాల్చిన విధముగాఁ దెలివిమాలిన కార్యము.

క. మేలెంచని మాలిన్యుని
మాలను నగసాలివాని ♦ మంగలి హితుగా
నేలిన నరపతి రాజ్యము
నేలం గలిసిపోవుగాని ♦ నెగడదు సుమతీ. 25

టీక॥ సుమతీ, మేలు, ఎంచని=తా నితరులవలనఁ బొందిన ఉపకారమును తలఁచుకొనని, మాలిన్యుని=దుర్మార్గపు మనసుగలవానిని, మాలను=మాలవానిని, అగసాలివాని=కమసలవానిని, మంగలిన్=మంగలివానిని, హితుగాన్=స్నేహితునివలె, ఏలిన=అధికారములనిచ్చిన, నరపతిరాజ్యము=రాజుయొక్క రాజ్యము, నేలన్, కలిసి, పోవున్, కాని=నాశనమై పోవునేగాని, నెగడదు=వృద్ధిఁ జెందదు.

తా॥ చేసినమేలు మఱచినవానినిగాని, మాలవానినిగాని, కమసలవానిని గాని, మంగలివానినిగాని, రాజు తన స్నేహితునివలె ఎంచుకొని కొలువులోఁ జేర్చుకొనినయెడల వానిరాజ్యము నాశనమగును గాని వృద్ధిలోనికి రాదు.

వి శే॥ ఈ పద్యమును బోధింపకుండుట మంచిది.

సంపద

క. ఎప్పుడు సంపద కలిగిన
నప్పుడు బంధువులువత్తు ♦ రదియెట్లన్నన్
దెప్పలుగఁ జెఱువునిండినఁ
గప్పలు పదివేలుచేరుఁ ♦ గదరా సుమతీ. 26

టీక॥ సుమతీ, ఎప్పుడు, సంపద=ఐశ్వర్యము, కలిగినన్=వచ్చునో, అప్పుడు=ఆసమయమునందు, బంధువులు=చుట్టములు, వత్తురు, వచ్చెదరు. అది, ఎట్లన్నన్=అనచ్చుట, ఏప్రకారమనఁగా, తెప్పలుగన్=పూర్తిగా, చెఱువు

నిండినన్=చెఱువునిండుగ నీళ్ళువచ్చినయెడల, కప్పలుపదివేలుచేరుఁగదరా=కప్పలు అనేకములుగావచ్చి చేరునుగదా.

తా॥ చెఱువు నీళ్ళతో నిండినవెంటనే కప్పలు అనేకములువచ్చి చేరునట్లే, మనుష్యునకు ద్రవ్యము చేరఁగానే చుట్టములును వచ్చి చేరుదురు.

క లి మి లే ము లు

క. ఓడల బండ్లును వచ్చును
ఓడలు నా బండ్లమీఁద • నొప్పుగ వచ్చున్
ఓడలు బండ్లును వలెనే
వాడంబడుఁ గలిమిలేమి • వసుధను సుమతీ. 27

టీక॥ ఓడలన్=ఓడలగుండా. బండ్లును=బండ్లుకూడ, వచ్చును. ఓడలునాన్=ఓడలవలెనే, బండ్లమీఁదన్=బండ్లమీఁదను, ఒప్పుగన్=చక్కఁగ, వచ్చున్=వచ్చును. వసుధను=భూమియందు, సుమతీ, ఓడలుబండ్లునువలెనే=ఓడలు బండ్లమీఁదను, బండ్లు ఓడలమీదను వచ్చినట్లే, కలిమి, భాగ్యమును, లేమి=దారిద్ర్యమును, వాడంబడున్=వాడఁబడును.

తా॥ ఓడలమీఁద బండ్లును, బండ్లమీఁద నోడలును వచ్చుచుండును. అట్లే యిప్పుడు భాగ్యవంతుఁడుగనుండువాఁడు కొంతకాలమునకు దరిద్రుఁడు కావచ్చును. ఇప్పుడు దరిద్రుఁడుగ నుండువాఁడు కొంతకాలమునకు భాగ్యవంతుఁడుగ నుండవచ్చును.

క. చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైనయట్లు • పామరుఁడుదగన్
హేమంబుఁ గూడఁబెట్టిన
భూమీశులపాలఁజేరు • భువిలో సుమతీ, 28

టీక॥ సుమతీ, భువిలోన్=భూమియందు, చీమలు=చెదలు, పెట్టిన పుట్టలు, పాములకున్=పాములకు, ఇరవు=ఇల్లు, ఐనయట్లు=ఐనట్లుగా, కామరుఁడు=తెలివితక్కువవాఁడు, తగన్=చక్కఁగా, హేమంబున్= బంగారమును, కూడన్, పెట్టినన్=చేర్చి ఉంచినయెడల, భూమి, యీశుల, పాలన్=రాజులచెంతకు, చేరున్=ప్రవేశించును.

తా॥ చెదలు పెట్టిన పుట్టలు పాములే ప్రకారముగా నాక్రమించుకొనునో, అట్లే, తెలివితక్కువవాఁడు కూర్చుకొనిన ధనమును రాజులు కాఁజేయుదురు.

క. తా ననుభవింప నర్థము
మానవపతిఁ జేరుఁగొంత ♦ మఱిభూగతమౌఁ
గానల నీఁగలు కూర్చిన
తేనియ యొరుఁ జేరునట్లు ♦ తిరముగ సుమతీ. 29

టీక॥ సుమతీ, తాను, అనుభవింపని=అనుభవింపనట్టి, అర్థము=డబ్బు, మానవపతిన్=రాజును, కొంత=కొంతభాగము, చేరున్=చేరును. మఱి=ఇంకను, భూగతమౌన్=నేలపాలగును, ఎట్లనఁగా, కానలన్, అడవులయందు, ఈఁగలు=తేనెటీఁగలు, కూర్చిన=కూడఁబెట్టిన, తేనియ=తేనె, తిరముగన్=స్థిరముగ, ఒరున్=ఇతరుని, చేరునట్లు=చేరిన విధముగ.

తా॥ అడవులలోఁ దేనెటీఁగలు కూడఁబెట్టిన తేనె యితరులను జేరునట్లు తా ననుభవింపక కూడఁబెట్టినవాని ధనములోఁ గొంతభాగము నేలపాలగును. మఱికొంతభాగము రాజులపాలగును. అనఁగా రాజులకుఁ జేరును.

క. ధనపతి సఖుఁడై యుండిన
నెనయంగా శివుఁడు భిక్ష ♦ మెత్తఁగవలసెన్
దనవారికెంతగల్గినఁ
దనభాగ్యమె తనకుఁగాక ♦ తథ్యము సుమతీ. 30

టీక॥ సుమతీ, ధనపతి=కుబేరుఁడు, సఖుఁడై=స్నేహితుఁడై, ఉండినన్=ఉండినను, ఎనయఁగన్, కాన్=సరిగా, శివుఁడు, భిక్షము, ఎత్తెఁగొనన్ గలసెన్=భిక్షమెత్తుట తప్పలేదు. తనవారికిన్=తనకు సంబంధించినవారికి, ఎంతకలిగినన్=ఎంతభాగ్యముండినను, తథ్యము=నిశ్చయముగా, తనభాగ్యము, ఎ= తన స్వంతభాగ్యమెంతయుండునో అంతమాత్రమే, తనకున్ కాక=తన కు పయోగమునకు వచ్చునుసుమా.

తా॥ కుబేరునంతవాఁడు స్నేహితుఁడుగనుండినను, శివునకు భిక్షమెత్తుట తప్పలేదు. దీనినిబట్టి తనభాగ్యమే తన కక్కఱకువచ్చునుగాని, తనవారి కున్న భాగ్యము తన కక్కఱకురాదని తెలియుచున్నది.

క. సిరి దా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ ♦ సలిలముభంగిన్
సిరి దాఁ బోయినఁ బోవును
కరిమ్రింగిన వెలఁగపండు ♦ కరణిని సుమతీ. 31

టీక॥ సుమతీ, సలలితముగన్=చక్కఁగా, నారికేళ సలిలము,భంగిన్= కొబ్బరికాయలోని నీళ్ళు, వలె, సిరి=ఐశ్వర్యము, తాన్, వచ్చినన్, వచ్చున్= వచ్చినయెడల, తనంతట తానేవచ్చును. కరి=ఏనుఁగు, మ్రింగిన, వెలఁగపండు, కరణిని=వలెనె, సిరి=ఐశ్వర్యము, తాన్=తనంతటతానే, పోయినన్, పోవున్=పోయినయెడల పోవును.

తా॥ కొబ్బరికాయలో ఎవరును పోయకుండనే తమంతట తాముగా నీళ్లువచ్చును. అట్లే ఐశ్వర్యముకూడా తనంతట తానుగ వచ్చును.

ఏనుఁగు మ్రింగిన వెలగకాయ పగిలిపోకుండ నుండినట్లున్నను లోపలనుండు గుజ్జు హరించిపోవును. ఆప్రకారముగానే ఐశ్వర్యముకూడ చూచుచు, చూచుచునుండగనే మాయమైపోవును.

కం. వేసరపు జాతిగానీ
వీసము దాఁ జేయనట్టి ♦ వేఁతిఁడిగానీ
దాసికొడుకైనఁగానీ
కాసులుగలవాఁడె రాజు ♦ గదరా సుమతీ. 32

టీక॥ సుమతీ, వేసరపుజాతిగానీ=నీచకులమునఁ బుట్టినవాఁడైయైనను, తాన్=తను, వీసముచేయనట్టి=ఏమాత్రమును గౌరవములేని, వేఁతిఁడిగానీ=తెలివితక్కువవాఁడైయైనను, దాసికొడుకు ఐనఁగానీ=నీచస్త్రీయందుఁ బుట్టినవాఁడైయైనను, రాజు=ప్రభువు అనఁగా గొప్పవాఁడు, కాసులుగలవాఁడెగదరా=ద్రవ్యమున్నవాఁడేగదా.

తా॥ ధనమున్నవానిని, వానికులము గౌరవము మొదలగునవి చూడకుండ, అందఱును రాజునువలె గౌరవింతురు.

కం. కులకాంత తోడ నెప్పుడుఁ
గలహింపకు వట్టితప్పు ♦ ఘటియింపకుమీ
కలకంఠికంటికన్నీ
రొలికిన సిరియింటనుండ ♦ నొల్లదు సుమతీ. 33

టీక॥ సుమతీ=మంచిబుద్ధిగలవాఁడా, కులకాంతతోడన్=వివాహమైన యాఁడుదానితో, ఎప్పుడున్=ఎన్నటికని, కలహింపకు=పోట్లాడవద్దు. వట్టితప్పు=లేని నేరమును, ఘటియింపకుమీ=కల్పింపఁబోకుము. (ఏలయన) కలకంఠికంటి=ఆఁడుదానియొక్క, కన్నీరు, ఒలికినన్=కన్నులనుండి నీరు, జారినయెడల, సిరి=భాగ్యము, ఇంటన్,ఉండన్, ఒల్లదు=ఇంటిలో నుండుటకు నొల్లదు.

తా॥ ఆఁడువారితో నెప్పటికిని పోట్లాడరాదు. తప్పుచేయకపోయినను తప్పుచేసినదని చెప్పరాదు. ఏలయనఁగా, స్త్రీలు దుఃఖముచెందు నిండ్లయందు నైశ్వర్యమునిలువదు. ఓమంచిబుద్ధిగలవాఁడా, (వినుము).

వి॥ కలకంఠము అనఁగా కోయిల, కనుక కలకంఠ కంఠి=కోయిల కంఠస్వరమువలె మనోహరమైన కంఠస్వరముగలది అనఁగా స్త్రీయని యర్థము.

కులకాంత యనఁగా భార్యయని అర్థము చెప్పుటకంటె స్త్రీయనుట మంచిది, ఏలయన నీపద్యమునందలి నీతిబోధ భార్యయెడల మాత్రమే కాక స్త్రీలకందఱకును అన్వయింపఁదగియున్నది.

క. పనిసేయునెడల దాసియు
ననుభవమునరంభ మంత్రి యాలోచనలన్
తన భుక్తియెడలఁ దల్లియు
ననఁ దనకులకాంత యుండ నగురా సుమతీ. 34

టీక॥ సుమతీ, తన కులకాంత=తన భార్య అనఁగాఁ బ్రతివానిభార్య యు, పనిసేయునెడలన్=ఇంటిపనులను చేయునప్పుడు, దాసియు=దాసివలెను, అనుభవమునన్=సౌఖ్యము కలిగించునప్పుడు, రంభ=రంభయను దేవతా స్త్రీవలెను, ఆలోచనలన్=ఆలోచనలయందు, మంత్రి=మంత్రివలెను, తన భుక్తియెడలన్=తినదు భోజనముపెట్టు వేళయందు, తల్లియు=తల్లివలెను, అనన్=అన్నదనునట్లు, ఉండనగురా=ఉండవలెనుసుమా.

తా॥ భార్య యింటిపనులు చేయునప్పుడు దాసిదానివలెఁ గష్టపడి చేసికొనవలెను. భర్తను సంతోషపెట్టుసమయమున రంభయను దేవతల భోగముదానివలె లాలించి సౌఖ్యమును గలుగఁజేయవలెను. భర్తకు ఆలోచనలు చెప్పునప్పుడు మంత్రివలె చెప్పవలెను. భర్తకు అన్నము పెట్టునపుడు తల్లివలె న చేతితోఁ బెట్టవలెను. ఉండి మంచిపేరు దెచ్చుకోవలెను.

వి॥ శ్లో॥ కార్యేషుదాసీ కరణేషుమంత్రీ
రూపేచలక్ష్మీ క్షమయాధరిత్రీ
భోజ్యేషుమాతా శయనేషువేశ్యా
షట్కర్మయుక్తా కులధర్మపత్నీ॥

ఈ శ్లోకమునకును దానియర్థమును వ్రాయఁదలఁచి వ్రాసిన పైపద్యమును వివరించి బాలురకుఁ జెప్పవలెను.

క. కనకపు సింహాసనమున
శునకముఁ గూర్చుండఁబెట్టి • శుభలగ్నమునన్
దొనరఁగఁ బట్టముఁ గట్టిన
వెనుకటి గుణమేలమాను • వినరా సుమతీ. 35

టీక॥ సుమతీ, శుభలగ్నమునందున్ = మంచి ముహూర్తమునందు, శునకమున్ = కుక్కను, కనకపు = బంగారముతోఁ జేయఁబడిన, సింహాసనమునన్ = సింహాసనమునందు, ఒనరఁగన్ = ఒప్పునట్లు, కూర్చుండన్, పెట్టి = కూర్చోనఁబెట్టి, పట్టమున్ కట్టినన్ = పట్టాభిషేకము చేసినను, వెనుకటిగుణము, పట్టాభిషేకము చేయకమునుపున్న గుణము, ఏలమానున్? = ఎందుచేత మానును? అనఁగా మానదు.

తా॥ కుక్కను బంగారపు సింహాసనమునఁ గూర్చోనఁబెట్టి మంచి ముహూర్తమునఁ బట్టాభిషేకము చేసినను దాని పూర్వపు నీచబుద్ధులు మానదు. అట్లే నీచునకు గొప్ప అధికారమిచ్చినను తన పూర్వపు నీచబుద్ధులు మానఁడు.

క. కొఱగాని కొడుకు పుట్టిన
కొఱగామియెకాదు తండ్రి • గుణములుఁ జెఱచున్
జెఱకుతుద వెన్ను పుట్టినఁ
జెఱకునఁ దీపెల్లఁ జెఱచు • సిద్ధముసుమతీ. 36

టీక. కొఱగానికొడుకు = ప్రయోజకుఁడుకాని కొడుకు, పుట్టినన్ = పుట్టినయెడల, కొఱగామియ = అక్కఱకు రాకపోవుటమాత్రమే, కాదు, తండ్రిగుణములున్ = తండ్రిగుణములుకూడ, చెఱచున్ = చెడఁగొట్టును. ఎట్లనఁగా, చెఱకుతుదన్ = చెఱకుగడ చివర, వెన్ను పుట్టినన్ = వెన్ను పుట్టినయెడల, చెఱకు

నక్ = చెఱకునందుఁగల, తీపి, ఎల్లక్ = తీపినంతయు, చెఱచుక్ = చెడఁగొట్టును. తథ్యము = ఇది నిశ్చయము.

తా॥ ప్రయోజకుఁడుకాని కుమారుఁడు పుట్టినందున తాను చెడుట యట్లుండఁగా, చెఱకుచివర పుట్టు వెన్ను తాను చెడ్డదేకాక చెఱకునందలి తీపి నంతను చెడఁగొట్టినట్లు, తండ్రికిఁగల మంచిగుణములనుగూడఁ బాడుచేయును.

క. తనకోపమె తనశత్రువు
తనశాంతమె తనకురక్ష ♦ దయ చుట్టంబౌ
దనసంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు ♦ తథ్యము సుమతీ. 37

టీ॥ సుమతీ, తనకోపమె = తనకున్న కోపమె, తనశత్రువు = తనకు అపకారముచేయు విరోధి. తనశాంతమె = తనకున్న నెమ్మదిస్వభావమే, తనకురక్ష = తనను రక్షించు స్నేహితుఁడు. దయ = తనయందుండు దయగలస్వభావమే, తన చుట్టంబు, ఔక్ = తన మేలు కోరుకొను, చుట్టము అగును. తనసంతోషమె = తనయందుఁగల సంతోషించుగుణమే, స్వర్గము = సమస్తసౌఖ్యములిచ్చు స్వర్గలోకము. తనదుఃఖమె = తనయందుండు దుఃఖపడుగుణమె, నరకము, అండ్రు = నరకము అని చెప్పుదురు. తథ్యము = ఇదినిశ్చయము.

తా॥ మనుష్యులకు కోపస్వభావమే శత్రువువలె నపకారము కలిగించును. శాంతస్వభావమే మిత్రునివలె రక్షించును. దయగలస్వభావమే చుట్టమువలె మేలుచేయును. సంతోషము స్వర్గలోకమువలె సర్వసౌఖ్యముల నిచ్చును. దుఃఖము నరకలోకమువలె సమస్తబాధలను కలిగించును. కనుక వీనిలో మంచివి గుణము చేర్చుకొని చెడ్డవి విడిచిపెట్టవలయును.

క॥ నయమునఁ బాలుంద్రావరు
భయమునను విషమ్మునైన ♦ భక్షింతురుగా

నయమెంత దోసకారియొ
భయమే చూపంగవలయు • బాగుగ సుమతీ! 38

టీక॥ సుమతీ నయమునన్=మంచితనముచూపి చెప్పినయెడల, పాలున్=పాలనుగూడ, త్రాగరు=పుచ్చుకొనరు. భయమునను=భయపెట్టి చెప్పినయెడల, విషమ్మునైనన్=విషమునైనను, భక్షింతురుగా=తిందురుగదా, నయము=మంచితనము, ఎంతదోసకారియో=ఎంతపాపిష్టిదో. కనుక, భయమే చూపంగన్ వలయున్=భయపెట్టుచునే యుండవలయును.

తాత్ప॥ బ్రతిమాలి చెప్పినచో మంచిపనినైనను చేయరు. భయపెట్టినచో కష్టమగుపనులనుగూడఁ జేయుదురు. కనుక భయపెట్టుటయే శ్రేష్ఠము.

క॥ లావుగలవానికంటెను
భావింపఁగ నీతిపరుఁడు • బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాఁ డెక్కినట్లు • మహిలో సుమతీ! 39

టీక॥ సుమతీ, మహిలోన్=భూమియందు, లావుగలవానికంటెన్=బలిసియున్నవానికంటె, భావింపఁగన్=ఆలోచించిచూడఁగా నీతిపరుడు=నీతిప్రవర్తనకలవాఁడు, బలవంతుండు, ఔన్=శక్తికలవాఁడగును. ఎట్లనఁగా గ్రావంబు, అంతగజంబును=కొండంత ఏనుఁగును మావటివాఁడు ఎక్కినట్లు=మావటివాఁడు స్వాధీనముచేసికొనినట్లు.

తాత్ప॥ కొండంత పెద్దదిగనుండు ఏనుఁగునుగూడ చిన్నవాడగు ఒక మనుష్యుఁడు స్వాధీనము చేసికొనుచున్నాఁడు. దీనిని బట్టిచూడఁగా శరీరము లావుగానున్నవానికంటె బుద్ధియందు చురుకుఁదనముగలఁ వాఁడెక్కువబలవంతుడని తెలియుచున్నది.

క॥ పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుఁడు జన్మించినపుడె ♦ పుట్టదు జనులా
పుత్రునిఁ గనుఁగొని పొగడఁగ
బుత్రోత్సాహంబు నాఁడు ♦ పొందుర సుమతీ॥ 40

టీక॥ సుమతీ, తండ్రికిన్=కుమారులను గనినతండ్రికి, పుత్రోత్సాహము=కుమారునివలన కలుగవలసిన సంతోషము, పుత్రుఁడు జన్మించినపుడె=కుమారుఁడు పుట్టినాఁడనఁగానే, పుట్టదు=కలుగదు. జనులు=మనుష్యులు, ఆపుత్రునిన్, కనుఁగొని=ఆకుమారునిఁజూచి, పొగడఁగన్=మంచివాఁడని మెచ్చుకొనుచుండగా, నాఁడు=ఆనాఁడు, పుత్రోత్సాహంబున్=పుత్రుఁడు కలిగినందుకు పొందవలసిన సంతోషము, పొందుర,=పొందునుసుమా.

తాత్ప॥ పుత్రుఁడుకలిగిన సంతోషము తండ్రి ఆపుత్రుఁడు పుట్టిననాఁడు పొందఁడు. ఆపుత్రుఁడు మంచివాఁడని నలుగురు మెచ్చుకొనుచుండగా విని నాఁడుపుత్రోత్సాహము పొందును.

కరణము

క॥ ఒక యూరికి నొకకరణము
నొకతీర్పరియైనఁగాక ♦ యొగిఁదఱచైనన్
గకవికలుగాక యుండునె
సకలంబునుగొట్టువడక ♦ సహజము సుమతీ॥ 41

టీక. సుమతీ, ఒకయూరికిన్=ఒకగ్రామమునకు, ఒక కరణము=ఒకగ్రామాధికారియును ఒకతీర్పరి=ఒకపెత్తనదారు, ఐనన్, కాక= వీరుమాత్రమేకాక, ఒగిన్=ఇంకను, తఱచైనన్=విశేషము నుండియుండినచో; కకవికలు, కాకఉండునె=గడబిడలు పుట్టకుండ, ఉండునా? సకలంబును=అన్నిపనులును కొట్టుపడకయుండునా? చెడిపోకుండనుండునా? సహజము=ఇట్లుజరుగుట స్వభావసిద్ధము.

తాత్ప॥ ఒక్కొక్క గ్రామమున కనేకులు కరణములుగాని తీర్పరులు గాని యున్నయెడల చిక్కు ఎక్కువగనుండును.

క. కరణముఁ గరణము నమ్మిన
మరణాంతకమౌను గాని ♦ మనలేఁడు సుమీ
కరణము దనసరికరణము
మఱినమ్మక మర్మమీక ♦ మనవలె సుమతీ. 42

టీక॥ సుమతీ, కరణముఁ, కరణము, నమ్మినన్ = ఒక కరణము మఱియొక కరణమును నమ్మినయెడల, మరణాంతకమౌను = చావును దెచ్చును. కాని, మనలేఁడు సుమీ = బ్రదుకఁ జాలఁడు సుమా. కనుక, కరణము, తనసరికరణమున్ = ఒక కరణము, మఱియొక కరణమును, మఱినమ్మక = ఎంతమాత్రమును నమ్మక, మర్మమీక = రహస్యములు తెలియచేయక, మనవలెన్ = బ్రదుకవలెను.

తాత్ప॥ ఒకకరణము మఱొక కరణముతో తనగుట్టు తెలియ నీయక జాగ్రతగ బ్రదుకని యెడల ప్రాణాంతకమగును.

క. కరణముల ననుసరింపక
విరసంబునఁ దిన్నతిండి ♦ వికటించు సుమీ.
యిరుసునఁ గందెనఁ బెట్టక
పరమేశ్వరు బండియైనఁ ♦ బాఱదు సుమతీ. 43

టీక॥ సుమతీ, కరణములన్, అనుసరింపక = కరణములకు విధేయుఁడై యుండక, విరసంబునన్ = విరోధము మీఁద, తిన్న, తిండి = భోజనముచేసిన అన్నము, వికటించు సుమీ = విరోధము చేయును సుమా. ఎట్లనఁగా, ఇరుసునన్ = బండియొక్క యిరుసునందు, కందెనన్ = (చక్రములు సులభముగ తిరుగుటకు గాను పెట్టెడు) పీఁచు కొవ్వు మొదలగు వానిని, పెట్టక, పరమేశ్వరు బండియైనన్ = భగవంతుని బండియైనను, పాఱదు = పరుగెత్తదు.

తాత్ప॥ బండికి యిరుసువలెం దెస పెట్టినియెడల భగవంతుని బండిరైన ను నడువవన్లే, కరణములను ఆశ్రయించుకొని యుండక విరోధము పెట్టుకొని నచో సౌఖ్యముగ బ్రదుకుటకష్టము.

క॥ కరణము సాధై యున్నను
కరిమదముడిగినను బాము - కఱవకయున్నన్
ధర తేలు మీటకున్నను
గరమరుదుగ లెక్కఁగొనరు - గదరాసుమతీ! 44

టీక॥ సుమతీ, కరణము=గ్రామాధికారి, సాదు, ఐ, ఉన్నను=మెత్తనివాఁడై ఉండినను, పాము, కఱవకయున్నన్=కఱవకుండినను, ధరన్=భూమియందు, తేలు, మీటకున్నను=కుట్టకయున్నను, కరి=ఏనుఁగు, మదము=పొగరుబోతుతనమును, ఉడిగినను = విడిచియుండినను, కరము = మిక్కిలి. అరుదుగన్=వింతయగునట్లుగ, లెక్కన్, కొనరు, కదరా=లక్ష్యము సేయరుసుమా.

తా॥ కరణము మెత్తనివాఁడుగ నున్నను, ఏనుఁగు నిదానముగనున్నను, పాముకఱవకుండనున్నను, తేలు కుట్టకపోయినను, ప్రపంచములో వాని నెవరును లక్ష్యముచేయరు.

క. పొరుగునఁ బగవాఁడుండిన
నిరవొందఁగ వ్రాతకాఁడె ♦ యేలికయైనన్
ధరఁగాఁపు కొండెమైనను
కరణాలకు బ్రదుకు లేదు ♦ గదరాసుమతీ. 45

టీక॥ సుమతీ, పొరుగునన్=(కరణముల) యిండ్లప్రక్కనే, పగవాఁడు ఉండినన్=(కరణమునకు) విరోధియగువాఁడు ఉన్నను, ఇరవు, ఒందఁగన్=చక్కఁగ, ఏలిక=ప్రభువు, వ్రాఁతకాఁడె, ఐనన్=వ్యవహారము చక్కఁబెట్టుకొనఁగలవాఁడెయైనను, ధరన్= భూమియందు, కాఁపు=సంసారి, కొండెము,

పిసను=చాడీలు చెప్పువాఁడైనను, కరణాలకున్ = కరణములకు, బ్రతుకు లేదుగదరా=(తనమాట కెదురులేకుండ) బ్రదుకుటకు వీలులేదుగదరా.

తా॥ కరణముల యిండ్లపొరుగున విరోధియగువాఁడుండినను. పైయధికారి వదుపుకొనినవాఁడైనను, కాఁపువాఁడు చాడీలకోరైనను. కరణముయొక్క అధికారము నిరాటంకముగ జరుగదు.

క. ఆఁకొన్న కూడె యమృతము
తాఁకొందక నిచ్చువాఁడె ♦ దాతధరిత్రిన్
సోఁకోర్చువాఁడె మనుజుఁడు
తేఁకువగలవాఁడువంశ ♦ తిలకుఁడుసుమతీ. 46

టీక॥ సుమతీ, ఆఁకొన్నకూడె=ఆఁకలి చేయునప్పుడు తినిన అన్నమే, అమృతము=అమృతమువంటిది. తాఁకు, ఒందక=ఇబ్బందిపడక, ఇచ్చువాఁడె=దానముచేయువాఁడె, దాత=దానము చేయువాఁడు. (ధర్మాత్ముఁడు) ధరిత్రిన్=భూమియందు, సోఁకు=కష్టమును, ఓర్చువాఁడె=ఓర్చుకొనువాఁడె, మనుజుఁడు=మనుష్యుఁడు, తేఁకువ=ధైర్యము, కలవాఁడె=ఉన్నవాఁడె, వంశతిలకుఁడు=వంశమునకుఁగీర్తి తెచ్చువాఁడు.

తాత్ప॥ ఆఁకలి వేయునప్పుడు తినెడియన్నమే అమృతము వంటిది; తాను ఇబ్బందిపడక దానముచేయువాఁడె దాత; కష్టములను ఓర్చుకొనఁగల వాఁడె మనుష్యుఁడు; ధైర్యముగలవాఁడె వంశమునకుఁగీర్తి తెచ్చువాఁడు.

వి॥ తేఁకువ అనఁగా ధైర్యము, భయము అను రెండర్థములును ఇచ్చును కనుక తేఁకువగల వాఁడనఁగా సత్కార్యములుచేయుటకు ధైర్యమును దుష్కార్యములను చేయుటకు భయమును అని వివరింపవలెను.

క. ఇచ్చునదె విద్య రణమునఁ
జొచ్చునదే మగతనంబు ♦ సుకవీశ్వరులున్

మెచ్చునదె నేర్పు వాదుకు
వచ్చునదే కీడుసుమ్ము • వసుధను సుమతీ. 47

టీక॥ సుమతీ. ఇచ్చునదె=ఇతరులకిచ్చునది, విద్య=జ్ఞానము, రణమునన్ = యుద్ధమునందు, చొచ్చునదె=ప్రవేశించునది, మగతనంబు=పౌరుషము, సుకవీశ్వరులన్=మంచి కవీశ్వరులను, మెచ్చునదె=మెచ్చుకొనునదియే, నేర్పు=తెలివి, వసుధను=భూమియందు, వాదుకున్=వాదమునకు, వచ్చునదే=రావటమే, కీడుసుమ్ము=కీడుసుమా.

తా॥ ఇతరులకు ఇచ్చునది జ్ఞానము, యుద్ధమునందు ప్రవేశించునదే పౌరుషము, మంచికవీశ్వరులను మెచ్చుకొనునదే నేర్పరితనము, వాదులాడుటకు దిగుటయే కీడు.

వి॥ సుకవీశ్వరులను మెచ్చుకొనుట యనఁగా వారిగ్రంథములను మెచ్చుకొనుటయని గ్రహింపవలెను.

క॥ ఇమ్ముగఁ జదువని నోరును
నమ్మాయని పిలిచియన్న • మడుగని నోరున్
దమ్ములఁ బిలువని నోరును
గుమ్మరి మను ద్రవ్వినట్టి • గుంటర సుమతీ. 48

టీక॥ఇమ్ముగన్=చక్కఁగ, చదువని=చదువుకొనని, నోరును=అమ్మా, అని, పిలచి, అన్నము, అడుగనినోరున్=అన్నముపెట్టుమని అడుగని నోరును, తమ్ములన్=తమ్ములను, పిలువని, నోరును, కుమ్మరి=కుమ్మరివాఁడు, మన్నుద్రవ్వి నట్టి=మన్నుద్రవ్వుకొనిన, గుంటర=గుంటతో సమముసుమా.

తా॥ శాస్త్రములు చదువనినోరును, తల్లిని బిలువనినోరును, తమ్ములను బిలువని నోరును, కుమ్మరివాఁడు రేగడిమన్ను ద్రవ్వుకొనగా మిగిలిన గుంటలతో సమానములేగాని, నోళ్ళని చెప్పఁదగవు.

క. ఉడుముండదె నూఱేండ్లును
బడియుండదె పేర్మిఁ బాము • పదినూఱేండ్లున్
మడువునఁ గొక్కెర యుండదె
కడునిలఁ బురుషార్థపరుఁడు • గావలె సుమతీ. 49

టీక॥ సుమతీ, ఉడుము=ఉడుము అనఁబడు జంతువు, నూఱేండ్లును=నందసంవత్సరములపాటు, ఉండదె ?=బ్రదికియుండదా? పేర్మిన్=దానికంటె హెచ్చుగా, పాము, పదినూఱుఏండ్లున్=పదినందల సంవత్సరములపాటు, పడియుండదె=పడియుండదా ? మడువునన్=చెఱువులో, కొక్కెర, ఉండదె=కొంగ జీవింపదా ? ఇలన్=భూమియందు, కడున్=మిక్కిలి, పురుషార్థపరుఁడు=పురుషార్థములయం దాసక్తిగలవాఁడు. కావలెన్=కావలయును.

తా॥ మనుష్యుఁడు పురుషార్థములయందు ఆసక్తికలవాఁడు కావలెను గాని కేవలము జీవించియున్నంతమాత్రముచేత ప్రయోజనము లేదు. ఎట్లనఁగా చెఱువులో కొంగయును బ్రదుకుచున్నది. ఉడుము నూఱుసంవత్సరములు బ్రదుకుచున్నది. పాము వెయ్యిసంవత్సరములు బ్రదుకుచున్నది. అయినను ఏమిలాభము. అట్లే పురుషార్థములయం దాసక్తిలేనివాఁడు జీవించుటకూడ వ్యర్థా.

విశే॥ పురుషార్థములనఁగా, ధర్మము, అర్థము, కామము, మోక్షము అనఁబడునవి.

క. ఉత్తమ గుణములు నీచున
కెత్తెఱఁగునఁ గలుగ నేర్చు • నెయ్యెడలందా
నెత్తిచ్చి కఱఁగి పోసిన
నిత్తడి బంగారమగునె • యిలలో సుమతీ. 50

టీక॥ ఇలలోన్=ప్రపంచమునందు, ఉత్తమగుణములు=మంచిగుణములు, నీచునకున్=నీచుఁడగువానికి, ఎత్తెఱఁగునన్=ఏవిధముగా, కలుగనేర్చున్=కాఁగలుగును. సుమతీ, ఎయ్యెడలన్=ఎచటనైనను, తాన్=తాను, ఎత్తి

ఇచ్చి=సమముగా (తూచి) ఇచ్చి, కరఁగిపోసినన్=కరఁగి పోఁతపోసినను, ఇత్తడి=ఇత్తడిలోహము, బంగారమౌనె?=బంగారపు లోహమగునా?

తా॥ ఎన్నితడవలు కరఁగిపోఁతపోసినను ఇత్తడి బంగారముగ నెట్లుమాఱదో అట్లే ఎన్నిపాట్లుపడినను నీచునకు గొప్ప గుణములు పట్టుపడవు.

క॥ ఉపకారికి నుపకారము
విపరీతముకాదుసేయ ♦ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాఁడు ♦ నేర్పరి సుమతీ॥ 51

టీక॥ సుమతీ, ఉపకారికిన్= ఉపకారముచేయువానికి. ఉపకారము=మేలు, చేయన్=చేయుట, విపరీతము కాదు=వింత సంగతికాదు. వివరింపంగాన్=ఆలోచింపఁగా, అపకారికిన్=కీడుచేసినవానికి, ఉపకారము=మేలు, నెపము=తప్పితమును ఎన్నక=తలఁచుకొనక, చేయువాఁడు=చేయునట్టివాఁడు, నేర్పరి=నేర్పుగలవాఁడు.

తాత్ప॥ తనకు ఉపకారముచేసినవానికి, విరోధముతలఁచకుండ సమయమువచ్చినపుడు సహాయముచేయువాఁడు నేర్పరి. వానిగుణము ఆశ్చర్యకరమును మెచ్చుకొనఁదగినదియు నగుచున్నది. కాని తనకు మేలుచేసిన వానికి మరల మేలుచేయుట గొప్పసంగతి కాదు.

క. ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటికామాటలాడి ♦ యన్యులమనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాఁడు ♦ ధన్యుఁడు సుమతీ. 52

టీక॥ సుమతీ, ఎప్పటికి, ఎయ్యది, ప్రస్తుతము=ఏసమయమునకు. ఏపని, తక్కువగఁదగియున్నదో, అప్పటికిన్=ఆసమయమునకు, ఆమాటలు, ఆడి=ఆ యాతగియుండిన మాటలను చెప్పి, అన్యుల=ఇతరులయొక్క, మనముల్=మన

న్నులను, నొప్పింపక=బాధపెట్టక, తాన్=తాను, నొవ్వక=బాధఁజెందక, తప్పించుక=తప్పించుకొని, తిరుగువాఁడు, ధన్యుఁడు=గెలిచినవాఁడు.

తాత్ప॥ ఏసమయమునకుఁదగినట్లామాటలు చెప్పి ఇతరుల మనస్సు కష్టపెట్టకుండను, తన మనస్సున కాయాసము కలిగించుకొనకయు తిరుగువాఁడు ధన్యుఁడు.

క. ఒల్లనిసతి నొల్లనిపతి
నొల్లనిచెలికాని విడువ ♦ నొల్లనివాఁడే
గొల్లండుకాక ధరలో
గొల్లండును గొల్లఁడౌనె ♦ గుణమున సుమతీ. 53

టీక॥ సుమతీ, ధరలోన్=భూమియందు, ఒల్లనిసతిన్=తనను ప్రేమింపని యాఁడుదానిని, ఒల్లనిపతిన్=తన నిష్టపడని యజమానుని, ఒల్లని చెలికానిన్=తనను ప్రేమింపనిస్నేహితుని, విడువన్=విడిచిపెట్టుటకు, ఒల్లనివాఁడే=ఇష్టపడనివాఁడే, గొల్లండు=గొల్లవాఁడు - అనఁగా వెఱ్ఱివాఁడు; కాక=అంతే గాని, గొల్లండును=గొల్లకులమునందుఁ బుట్టినవాఁడైనను, గుణమునన్=గుణము నుబట్టి చూడఁగా, గొల్లఁడౌనె ?=గొల్లవాఁడగునా ? అనగా వెఱ్ఱివాఁడ గునా ?

తాత్ప॥ తనను ప్రేమించని స్త్రీని, తనను ప్రేమించని యజమానుని, తనను ప్రేమించని స్నేహితుని విడువఁజాలని వాఁడే వెఱ్ఱివాఁడుగాని, కులముచేత గొల్లవాఁడైనంతమాత్రమున గొల్లవాఁడు వెఱ్ఱివాఁడగునా? గుణము ప్రధానము గాని కులము ప్రధానముకాదని తాత్పర్యము.

క. కప్పకు నొరగాలైనను
సర్పమునకు రోగమైన ♦ సతి తులువైనన్
ముప్పున దరిద్రుఁడైనను
దప్పదు మఱిదుఃఖమగుట ♦ తథ్యము సుమతీ. 5

టీక॥ సుమతీ, కప్పకున్, ఒరగాలు (ఒరగు. కాలు)=వంకరకాలు, ఐనను=సంభవించినను, సర్పమునకున్=పామునకు, రోగము ఐనన్=రోగము సంభవించినను, సతి= ఇంటికైనయాఁడుది, కులట, ఐనన్=కపటముగలది యైనను, ముప్పునన్=ముసలితనమందు, దరిద్రుఁడు, ఐనన్=పేదవాఁడైనను, మఱి= ఎక్కువగా, దుఃఖమగుట=దుఃఖము సంభవించుట, తప్పదు=తప్పిపోదు, తథ్యము=ఈమాటలు నిజము.

తా॥ కప్పకు కుంటికాలు ఏర్పడినను, పామునకు రోగమువచ్చినను, ఇల్లాలు కపటముకలదియైనను, ముసలితనమందు పేదవాఁడైనను, ఎక్కువగా కష్టములనాభవింపవలసివచ్చును.

వి॥ కప్పకు కాళ్ళుబాగున్నపుడే సరిగ నడువలేదు. కుంటితనము కూడ సంభవించినచో నిఁక దానిపాట్లు చెప్పవలయునా? సర్పము రోగము లేనపుడు తన ఆహారముకొఱకు తెఁగతిరిగిననేగాని దొరకదు. అది తిరుగ శక్తిలేకుండ జబ్బుపడినచో లంఘనములు చేయవలసినదేగాని దానిస్థితికి జాలిఁజెంది దాని కాహారము నెవరుతెచ్చిపెట్టుదురు? ఇల్లాలు కపటముగలదియైనచో నింటియందలి వస్తువుల నమ్ముకొనుట మొదలగు దుర్మార్గములను జేయుచుండును. డబ్బుసంపాదింపలేని ముసలితనమున పేదరికముచే సంభవించు కష్టములు స్పష్టమేగదా.

నీతులు

క. కమలములు నీటఁ బాసినఁ
కమలాప్తుని రశ్మిసోఁకి • కమలినభంగిన్
దమతమ నెలవులు తప్పినఁ
దమమిత్రులుశత్రులౌట • తథ్యము సుమతీ. 55

టీక॥ సుమతీ, కమలములు, నీటన్, పాసినన్=నీటిని విడిచిపెట్టినయెడల, కమల, ఆప్తుని=కమలములకు స్నేహితుఁడైన సూర్యునియొక్క, రశ్మి=కాం

తి అనఁగా ఎండ, సోఁకిన=తాకి, కమలిన, భంగిక్=వాడిపోయినవిధముగా, తమతమ=వారువారుండవలసిన, నెలవులు=చోటులు, తప్పినక్=తప్పిపోయిన యెడల, తమ మిత్రులు=తమ స్నేహితులు, శత్రులౌట=విరోధులగుట, తథ్యము= నిజము.

తా॥ కమలములు తాముండవలసిన నీటియందేయున్నయెడల సూర్యరశ్మికి వికసించి చక్కఁగ నుండును. నీటినివిడిచి ఒడ్డునకువచ్చినయెడల అదివఱకు ఏసూర్యరశ్మికి వికసించినవో ఆసూర్యరశ్మికే వాడి ఎండిపోవును. అట్లే స్నేహితులు తాము ఎచటనుండవలెనో అచట నిలచియుండినంతవఱకే స్నేహము చక్కఁగను. తాము ఉండవలసినచోట్లనుండక అతిక్రమించినయెడల తమ స్నేహముచెడి విరోధమువచ్చుట నిజము.

సూ॥ కమలములు సూర్యుఁడు ఉదయింపఁగానే వికసించును. కనుక కమలములకు సూర్యుఁడు స్నేహితుఁడని చెప్పఁబడును. ఒక మహమ్మదీయుఁడును ఒక బ్రాహ్మణుఁడును స్నేహముగనున్నచో వారివారికిఁ దగినచోటులయందుండునంతవఱకును స్నేహమునిలుచునుగాని, ఒకరి వంటయింట్లోనికి మఱొకరు ప్రవేశింపఁజూచుటయే తమతమ నెలవులుతప్పుట, అట్లు ప్రవేశించినవెంటనే స్నేహముచెడి విరోధమువచ్చును. ఇది చక్కఁగ బోధింపవలెను.

క. కారణములేని నగవును
పేరణమునులేని లేమ ♦ పృథివీస్థలిలోఁ
బూరణములేని బూరెయు
వీరణములులేని పెండ్లి - వృధరా సుమతీ. ౫౬

టీక॥ కారణములేని నగవును=కారణములేకుండ నవ్వుటయు, పేరణములేని, లేమ=రవిక, తొడుగుకొనని ముత్తైదువయును, పూరణము=పప్పుఉండ, లేని, బూరెయుక్=పెట్టని,పూర్ణపుబూరెయును, వీరణములేని, పెండ్లి=*చర్మవాద్యము లేని, పెండ్లి, ఇవన్నియు, పృథివీస్థలిలోక్=భూమియందు, వృథరా సుమతీ=ఓసుమతీ, పనికిరానివగును సుమా.

తా॥ కారణములేకయే నవ్వుటయు, రవికతొడుగుకొనకుండనున్న ముత్తైదువయు, పూర్ణము పెట్టని పూర్ణపుబూరెయు, మేళములేని పెండ్లియు ప్రయోజనములేనివి.

విశే॥ కారణములేకుండ నవ్వినచో వెఱ్ఱివాఁడని పేరువచ్చును. ముత్తైదువ రవికతొడుగుకొననియెడల నేపుణ్యకార్యములు చేయరాదని శాస్త్రము. తక్కినవి సులభము.

ఈ పద్యమునందలి రమ శబ్దమునకు స్త్రీయని అర్థముచెప్పుచో విధవలుగూడ రవికతొడుగుకొనవలయునని యర్థము చెప్పవలసివచ్చును గనుక అటువంటి అపార్థము రాఁకుండుటకుఁగాను ముత్తైదువ అని అర్థము వ్రాసినాను. ధర్మశాస్త్రములయందుఁగూడ నీవిషయము ముత్తైదువలను గుఱించియే చెప్పఁబడుచున్నది.

కేవలము బూరెలయందు పూర్ణమే పెట్టరు కనుక నిట్టి బూరెలను పూర్ణపుబూరెలనియే గ్రహింపవలెను.

క. చింతింపకు గడచినపని
కింతులు వలతురని నమ్మ ♦ కెంతయు మదిలో
నంతఃపుర కాంతలతో
మంతనముల మానుమిదియ ♦ మతము సుమతీ. 57

టీక॥ సుమతీ, మదిలోన్=మనసులో, కడచినపనికిన్=జరిగిపోయిన పనికి, చింతింపకు=దుఃఖపడవద్దు. ఇంతులు=ఆఁడువాండ్రు, వలతురని=ప్రేమించెదరని, ఎంతయున్=ఎంతమాత్రమును, నమ్మకు=నమ్మఁబోకుము. అంతఃపురకాంతలతోన్=సంసారముచేయు నీఁడుగల స్త్రీలతో, మంతనములన్=ఒంటరిగ మాటలాడుటలు, మానుము=వదలివేయుము. ఇదియ=ఈ చెప్పఁబడినదే, మతము=పూజింపఁబడిన పద్ధతిసుమా.

తా॥ సుమతీ, జరిగిపోయిన పనికిఁ జింతింపకుము. ఆఁడువారు గట్టిగ ప్రేమింతురని నమ్మకుము. ఈదేశః ఆడువాండ్రతో నొంటరిగ మాటలాడకుము.

వి॥ అంతఃపుర కాంతలని పాదపూరణము కొఱకుపయోగించెననితోఁ చెడిని. యుక్తవయస్కురాలగు నే ఆఁడుమనిషి తోడను అనియర్థము చెప్పిన దోషమేమియు లేదు.

క. చేతులకుఁ దొడవుదానము
భూతలనాథులకుఁ దొడవు ♦ బొంకమి ధరలో
నీతియె తొడవెవ్వారికి
నాతికి మానంబె తొడవు ♦ నయముగ సుమతీ. 58

టీక॥ సుమతీ, చేతులకున్=చేతులకు, తొడవు=సొమ్ము, దానము=దానముచేయుట, భూతలనాథులకున్=రాజులకు, బొంకమి=అబద్ధమాడకుండుట, తొడవు=సొమ్ము. ధరలోన్=భూమియందు, ఎవ్వారికిన్=ఎవ్వరికైనను అనఁగా అందఱకును, నీతియె=మంచిప్రవర్తనయె, తొడవు=అలంకారము. నయముగన్=న్యాయముగా, నాతికిన్=స్త్రీకి, మానంబె=లజ్జయే (సిగ్గు), తొడవు=నగ అనఁగా సొమ్ము.

తాత్ప॥ చేతులకు అందము తెచ్చు సొమ్ము దానము. రాజులకు అందము తెచ్చు సొమ్ము అబద్ధమాడకుండుట, స్త్రీలకు అందము తెచ్చు సొమ్ము లజ్జ; నీతి ప్రవర్తనము ఎవ్వరికైనను అందము నిచ్చు సొమ్ము.

క. తడవోర్వక యొడలోర్వక
కడువేగంబడిచిపడినఁ ♦ గార్యంబగు నే
తడవోర్చిన నొడలోర్చినఁ
జెడిపోయిన కార్యమెల్లఁ ♦ జేకురు సుమతీ. 59

టీక॥ సుమతీ, తడవు=ఆలస్యమునకు, ఓర్వక=ఓర్చుకొనలేక, ఒడలు, ఓర్వక=కష్టపడుటకు శరీరము నిలువఁజాలక, కడువేగంబు=మిక్కిలి వేగముగా,

అతిచిపడినన్ = అదిరిపడినయెడల, కార్యంబు=పని, అగునే? = నెఱవేఱునా? తడవు, తీర్చినన్ = ఆలస్యమునకు సహించినను, ఒడలు, ఓర్చినన్ = శరీరకష్టము నకు ఓర్చినను, చెడిపోయిన కార్యము, ఎల్లన్, చేకురున్ = చెడిపోయిన కార్య మంతయును, బాగుపడును.

తాత్ప॥ సులభము.

లక్ష్యముకుదరనివి.

కం. తనయూరి తపసితనమును
తనపుత్రుని విద్యపెంపుఁ - దనసతి రూపుం
దనపెరటిచెట్టు మందును
మనసున వర్ణింపరెట్టి మనుజులు సుమతీ. ౬౦

టీక॥ తనయూరి తపసితనమును=తనయూరిలో తానుచేయు తపస్సును, తనపుత్త్రుని=తన కుమారునియొక్క, విద్యపెంపున్ = చదువునందలి గొప్పతనము ను, తనసతిరూపున్ = తనభార్యయొక్క చక్కదనమును, తనపెరటి = తనదొడ్డి లోనుండు, చెట్టుమందును= చెట్టుయొక్క వైద్యమును, సుమతీ, ఎట్టిమనుజులు= ఎటువంటివారైనను, మనసునన్ = మనసులోనైనను, వర్ణింపరు= మెచ్చుకొనరు.

తాత్ప॥ తనయూరిలోఁ దానుచేయు తపస్సుయొక్క శక్తియు, తనకు మారుని పాండిత్యము, తన భార్యయొక్క చక్కఁదనము, తన దొడ్డిలోనుండు చెట్టుయొక్క వైద్యము, వీనిమీఁద లక్ష్యము కుదుగదు. కనుక వీనిని వారుచు లకనగాఁ జూతురుగాని గౌరవముగఁ జూడరు.

కం. తనకలిమి యింద్రభోగము
తనలేమి సర్వలోక ♦ దారిద్ర్యంబౌ
తనచావు జలప్రళయము
తనవలచినయదియెరంభ ♦ తథ్యము సుమతీ॥ ౬౧

టీక॥ తనకలిమి=తనకున్న భాగ్యము, ఇంద్రభోగము= దేవేంద్రుని భోగమంతదిగ నుండును. తనదుఃఖమె=తనకు సంభవించిన దుఃఖమె, సర్వలోక= అన్ని లోకములయందుఁగల, దారిద్ర్యంబు, ఔౕగా= పేదరికము అగును, తన చావు=తాను చనిపోవుట, జలప్రళయము = భూమియంతయు నీళ్ళతో మునిఁగి పోవుట, తనవలచినయది=తాను ప్రేమించినది రంభ=మిక్కిలిచక్కనిది సుమతీ, తథ్యము=నిజము.

తాత్ప॥ తనకున్న భాగ్యము కొద్దిపాటిదైనను దేవేంద్రుని భాగ్యమంతదిగఁ గన్పడును. తనకు కొద్దిపాటి దుఃఖము సంభవించినను లోకములన్నియు పేదరికముతో నిండియున్నట్లు కనఁబడును. తనొక్కఁడే చనిపోవుచున్నను లోకములన్నియు మునిఁగిపోవుచున్నట్లే కనఁబడును. తాను ప్రేమించినది కొద్దిపాటి అందగత్తెయైనను తనకండ్లకు రంభవలె కనఁబడును.

అనఁగా ఎవరికి ఏది దొరకునో అది వారివారి మనస్సులకు సాటిలేనిదానివలెఁ గనఁబడుచుండుట సహజము.

క. తలనుండు విషము ఫణికిని
వెలయంగాఁ దోఁకనుండు ♦ వృశ్చికమునకున్
దల, తోఁక, యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము ♦ గదరా సుమతీ. 62

టీక॥ సుమతీ, విషము, ఫణికిని=పామునకు, తలనుండున్=తలయందుండును, వెలయంగాన్=ప్రసిద్ధమగునట్లుగా, వృశ్చికమునకున్=తేలునకు, తోఁకన్, ఉండున్=తోఁకయందు అనఁగా కొండియందు ఉండును. ఖలునకున్= దుర్మార్గునకన్ననో, తలన్, తోఁకన్, అనక=తలయందు. తోఁకయందు అను భేదములేక, నిలువు, ఎల్లన్=శరీరమంతటియందును, విషము, ఉండునుగదరా.

తా॥ విషము పామునకు పడగయందుండును, తేలునకుఁ గొండియందుండును గాని దుర్మార్గునకు అక్కడ ఇక్కడ అను భేదములేక శరీరమునందంతటను ఉండును.

వి॥ పాము నోటితో మాత్రమే అపకారముచేయును. తేలు కొండితో మాత్రమే అపకారముచేయును. దుర్మార్గుఁడు అన్ని అవయవములతోఁగూడ నపకారము చేయునని భావము. పాదములతోఁ దన్నుట. చేతులతో దొంగిలించుట. వాక్కుతో నబద్ధములాడుట మొదలగువానిని బాలురకుఁ జెప్ప వలయును.

క. ధీరులకుఁ జేయు మేలది
సారంబగు నారికేళ ♦ సలిలము భంగిన్
గారవమును మఱిమీఁదట
భూరిసుఖావహము నగుచు ♦ భువిలో సుమతీ. 63

టీక॥ సుమతీ. భువిలోన్ = భూమియందు. ధీరులకున్ = మంచివారికి. చేయు, మేలు = మంచిపని (ఉపకారము), అది. నారికేళసలిలము. భంగిన్ = టెంకాయలోని నీళ్ళవలె. గారవమును = మర్యాదదెచ్చునదియును, మఱి = ఇంకను, మీఁదటన్ = ముందుముందు, భూరి = ఎక్కువగు, సుఖ, ఆవహము = సుఖమును గలిగించునదియును, అగుచున్ = అగుచు. సారంబగున్ = సారము గలది యగును.

తా॥ మంచివారికి ఉపకారముచేసినయెడల. టెంకాయలోనుండునీటి వలె. కీర్తిని దెచ్చును. మఱియు ముందుముందు సౌఖ్యమునుగూడఁ గలిగించును.

వి॥ టెంకాయయందుండునీళ్ళు టెంకాయకు గౌరవము నెప్పించు నవఁగా నీళ్ళుగల టెంకాయనే ప్రతివారును దీసికొనఁజూతురు. కనుక టెంకాయకు నీటివల్లనే గౌరవము వచ్చినది. అట్టి టెంకాయను కొట్టుకొని కొబ్బరితినుట సుఖావహమగు నందులకు గుర్తు. టెంకాయలో నీళ్లుండుటవల్ల ఆకాయకు ముందు గౌరవమువచ్చుట, తరువాత నది ప్రజలకు సౌఖ్యమునిచ్చుట వివరించి తరువాత ధీరులకుఁ జేయు మేలుకూడ నట్లే ముందు కీర్తిఁదెచ్చుననియు, పిమ్మటఁ దనకైన నవసరమువచ్చినపు డెల్లవారును సహాయముచేయువేళయందు సౌఖ్యము కలుగుననియు వివరింపఁబడెను.

క. నడువకుమీ తెరువొక్కటఁ
గుడువకుమీ శత్రునింటఁ • గూరిమితోడన్
ముడువకుమీ పరధనముల
నుడువకుమీ యొరుల మనసు • నొవ్వఁగ సుమతీ. 64

టీక॥ సుమతీ, ఒక్కటన్=ఒంటరిగా, తెరువు=మార్గమున, నడవకుమీ=నడిచిపోకుము, కూరిమితోడన్=ప్రేమతో, శత్రునింటన్=విరోధముగల వాని యింటిలో, కుడువకు=భోజనము చేయవద్దు. పరధనములన్=ఇతరుల ధనములను, ముడువకు మీ=దాచియుంచుకొనవద్దుసుమా. ఒరుల మనసు=ఇతరుల మనస్సు, నొవ్వఁగన్=కష్టపడునట్లు, నుడువకుమీ=మాటలాడవద్దు సుమా.

తా॥ ప్రయాణము చేయునపు డొంటరిగాఁ బోవలదు. విరోధముగల వాని యింటిలో నమ్మి భోజనము చేయవద్దు. ఇతరుల డబ్బు నపహరింపవద్దు. ఇతరుల మనస్సు కష్టపడునట్లు మాటలాడవద్దు.

క. నమ్మకు సుంకరి జూదరి
నమ్మకు మగసాలెవాని • నటు వెలయాలిన్
నమ్మకు మంగడివానిని
నమ్మకుమీ వామహస్తు • నవనిని సుమతీ. 65

టీక॥ సుమతీ, అవనిని=భూమియందు, సుంకరిన్=పన్నులు తీసికొను వానిని, జూదరిన్=జూదములాడువానిని, నమ్మకు=నమ్మవద్దు. అగసాలె వానిన్=కమసాలివానిని, అటు=అదేవిధముగ, వెలయాలిన్=భోగముదానిని, నమ్మకు=నమ్మవద్దు. అంగడివానిని=వర్తకముచేయువానిని, నమ్మకుము=నమ్మవద్దు. వామహస్తున్=ఎడమచేతితోఁ బనులను జేయువానిని, నమ్మకుమీ=నమ్మవద్దుసుమా.

తా॥ పన్నులు వసూలుచేయువానిని, జూదములాడువానిని, కమసాలివానిని, భోగముదానిని, వర్తకముచేయువానిని, ఎడమచేతితోఁ బనులను జేయునలవాటు గలవానిని నమ్మియుండఁగూడదు.

వి॥ కమసాలివానిని మాత్రమేకాక, వానివృత్తినవలంబించు నెవనినైనను అనియు, భోగముదాని వృత్తి నవలంబించు నెవతెనైనను అనియు ఇట్లే తక్కిన వాటులయందును గ్రహింపనగును.

క. నరపతులు మేరఁదప్పినఁ
దిర మొప్పఁగ విధవ యింటఁ ♦ దీర్పరియైనన్
గరణము వైదికుఁడైనను
మరణాంతకమౌనుగాని ♦ మానదు సుమతీ. 66

టీక॥ సుమతీ, నరపతులు=రాజులు, మేరన్ తప్పినన్=హద్దుతప్పిపోయినయెడలను, తిరము, ఒప్పన్ కన్=శాశ్వతముగా, విధవ=మగఁడులేనియాఁడుది, యింటన్=ఇంటిలో, తీర్పరి ఐనన్=పెత్తనము జరుపునది అయినను, కరణము=గ్రామాధికారి, వైదికుఁడు, ఐనను=వేదములననుసరించిపోవువాఁడైనను, మరణాంతకము, ఔను, కాని,=గొప్పఅపాయము సంభవించునుగాని, మానదు=తప్పిపోదు.

తాత్ప॥ రాజులు నీతితప్పినను, ఇంటిలో విధవకు పెత్తనమిచ్చినను, కరణమునకు నిష్ఠయుండినను కష్టములకు కారణమగును.

క. నవరసభావాలంకృత
కవితా గోష్ఠియును మధుర ♦ గానంబును దా
నవివేకి కెంత చెప్పినఁ
జెవిటికి సంకూదినట్లు ♦ సిద్ధము సుమతీ. 67

టీక॥ సుమతీ, నవరస, భావ, అలంకృత, కవితా, గోష్ఠియును=కవిత్వమునకుండవలసిన మంచిలక్షణముల సంగతులును, మధురగానంబును=మనోహరమగు సంగీతమును, తాన్=తాను, అవివేకికిన్=తెలివితక్కువవానికి, ఎంత, చెప్పినన్=ఎంత విచారించి చెప్పినను, చెవిటికి=చెవిటివానివద్ద, సంకు, ఊఁది నట్లు=శంఖమునుఊఁదినట్లే లాభములేనిపని, సిద్ధము=నిజము.

తాత్ప॥ మోటవానికి కవిత్వపు సంగతులు, సంగీతపు సంగతులు చెప్పుట నిష్ప్రయోజనము.

కం. నీరే ప్రాణాధారము
నోరే రసభరితమైన • నుడువుల కెల్లన్
నారే నరులకు రత్నము
చీరే శృంగారమందు • సిద్ధము సుమతీ. 68

టీక॥ సుమతీ, నీరే, ప్రాణ, ఆధారము=ప్రాణమునకు ముఖ్యమగునది నీరే, రస, భరితమైన=రసముచే నిండియుండునట్టి, నుడువులకున్. ఎల్లన్=మాటలకన్నిటికిని, నోరే ప్రాణాధారము=నోరే ముఖ్యమగు నాధారము. నరులకున్=మనుష్యులకు, నారే=స్త్రీయే. రత్నము=రత్నమువలె విలువలేని ముఖ్యాధారము. చీరే, శృంగారము, అందు=చీరకట్టుకొనుటయే, అందము నిచ్చును అని చెప్పుదురు, సిద్ధము=ఇదినిశ్చయము.

తాత్ప॥ ప్రాణమునకు నీరే ముఖ్యమగు నాధారము, మాటలాడుటకు నోరే ఆధారము, మనుష్యులలో స్త్రీలే ముఖ్యమగువారు. సౌందర్యమునిచ్చు అలంకారము లన్నిటిలోనికిని చీరయే ముఖ్యమగునది.

క. నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లిదండ్రి • నాధులతోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల • నయమిది సుమతీ. 69

టీక॥ సభలోపలన్=సభ జరుగుచుండు సమయమున, నవ్వకు. తల్లిదండ్రి తోడన్, నవ్వకు. నాధులతోడన్=అధికారులతో, నవ్వకు. పరసతితోన్=చుట్టరికములేని యాడుదానితో, నవ్వకుమీ. విప్రవరులన్=బ్రాహ్మణులలో శ్రేష్ఠులగువారినిజూచి, నవ్వకుమీ. నయమిది=న్యాయమైన పద్ధతియిది.

తా॥ సభలందు జరుగుచుండు సమయమున నవ్వరాదు. తల్లితోఁగాని, తండ్రితోఁ

గాని, యజమానితోఁగాని, బంధుత్వములేని స్త్రీతోఁగాని, మాటలాడునప్పుడు నవ్వఁగూడదు. బ్రాహ్మణులను పరిహాసముచేయరాదు. ఇదిన్యాయమగు పద్ధతి.

వి॥ నాథులనఁగా, అధికారులు, యజమానులు మొదలగువర్ధనములను చెప్పవచ్చును. ఆయాజనులతో నవ్వినచో నేమినష్టమో వివరింపవలెను.

క. పతికడకుఁ దన్నుఁగూర్చిన
సతికడకును వేల్పుకడకు ♦ సద్గురుకడకున్
సుతుకడకు రిత్తచేతుల
మతిమంతులుచనరు నీతి ♦ మార్గము సుమతీ. 70

టీ॥ సుమతీ, పతికడకున్ = యజమానునియొద్దకును, తన్ను = తనను, కూర్చిన = ప్రేమించిన, సతికడకున్ = స్త్రీయొద్దకును, వేల్పుకడకున్ = దేవుని యొద్దకును, సద్గురుకడకున్ = మంచివాఁడగు గురువునొద్దకును, సుతుకడకున్ = కుమారునియొద్దకును, మతిమంతులు = తెలివికలవారు, రిత్తచేతులన్ = ఉత్తచేతులతో, చనరు = వెళ్ళరు, నీతిమార్గము = ఇది న్యాయమగు విధము.

తా॥ ధర్మశాస్త్రములందు ఇట్లు చెప్పఁబడియున్నది. ఎట్లన, తెలిసిన వారు అధికారులయొద్దకును, తన భార్యయొద్దకును, దేవస్థానములయొద్దకును, గురువులయొద్దకును, చిన్నపిల్లలయొద్దకును. వెళ్ళునప్పు డేమైనఁ గానుకలను కొనికొని వెళ్ళవలయునుగాని ఉత్తచేతులతోఁ బోరాదు.

వి॥ శ్లో॥ అగ్నిహోత్రం, గృహం, క్షేత్రం। గర్భిణీం, వృద్ధ బాల యోః। రిక్తహస్తేన నోపేయా। ద్రాజానం దైవతం గురుమ్॥ అని శాస్త్రము. అనఁగా యజ్ఞయాగాదిక్రతువులు చేయుచోట్లయందును, పూర్ణాహుతులు జరుగుచుండు చోట్లను ఉండు అగ్నిహోత్రము దగ్గఱకును, నూతనముగ గృహప్రవేశముచేయఁబడుచుండు నిండ్లకును, పుణ్యక్షేత్రములయొద్దకును, గర్భిణీస్త్రీలను జూడఁబోవునపుడును, ముసలివారిని జూడఁబోవునపుడును, పసిపిల్లలున్న యిండ్లనుఁ జూడఁబోవువారును, రాజులను (అధికారులను) జూడఁబోవునపుడును, దేవుళ్ళను జూడఁబోవునపుడును, గురువులయొద్దకు వెళ్ళునప్పుడును ఉత్త

చేతులతో వెళ్ళరాదు. అనగా శ్రేష్ఠమైన కానుకలను తీసికొని వెళ్ళవలెనని తాత్పర్యము. ఈ శ్లోకార్థమును బద్యములో వ్రాయఁబోయి గ్రంథకర్త ఎట్లు వ్రాసినాడో బాలురకు వివరింపవలెను.

క. పరనారీసోదరుఁడై
పరధనముల కాసపడక ♦ పరులకు హితుఁడై
పరులు తనుఁ బొగడ నిగుడక
పరు లలిగిన నలుగ నతఁడు ♦ పరముఁడు సుమతీ. 71

టీక॥ సుమతీ, పరనారీ=(తనభార్యకుతప్ప) ఇతరస్త్రీలకందఱకును. సోదరుఁడై=అన్నదమ్ములతో సమానుఁడై, పరధనములకున్=ఇతరులధనములకు, ఆసపడక=తనవి కావలెనని కోరక, పరులకున్=ఇతరులకు, హితుఁడు, ని=ఇష్టుఁడై, పరులు=ఇతరులు, తనున్=తనను, పొగడన్=మెచ్చుకొనువేళ, నిగుడక=గర్వింపక, పరులు, అలిగినన్=ఇతరులు, తనపై, కోపపడినప్పుడు, అలుగని, అతఁడు=కోపపడనివాఁడు, పరముఁడు=శ్రేష్ఠుఁడు.

తా॥ సుమతీ, ఇతరుల స్త్రీలను, అప్పచెల్లెండ్రవలె భావించుము, ఇతరుల ద్రవ్యమాశింపక, ఇతరుల మేలుకోరుకొనుచు, తన నితరులు పొగడునప్పుడు గర్వింపక, ఇతరులు కోపపడినప్పుడు మరల వారిపైఁ గోపపడకయుండువాఁడు శ్రేష్ఠుఁడగువాఁడు.

క. పరసతి కూటమిఁ గోరకు
పరధనముల కాసపడకు ♦ పరు నెంచకుమీ
సరికాని గోష్ఠి సేయకు
సిరిచెడి చుట్టంబుకడకుఁ ♦ జేరకు సుమతీ. 72

టీక॥ సుమతీ, పరసతి కూటమిన్=ఇతరునిభార్యయొక్క సహవాసమును, కోరకు=కోరవద్దు. పరధనములకున్=ఇతరుల ధనములకు, ఆసపడకు=ఆశపడవద్దు. పరున్=నీవిరోధిని ఎంచకుమీ=తలఁచుకొనవద్దుసుమా. సరికాని

గోష్ఠిన్=నీతో సమానులు కాని వారితో స్నేహము, చేయకు. సిరిచెడి=భాగ్యముపోయి, (నపుడు) చుట్టంబుకడకున్=చుట్టమువద్దకు. చేరకు = పోవకుము.

తా॥ ఇతరుల భాగ్యులతో సహవాసము చేయవలెనని కోరరాదు. ఇతరులధనము నీకురాకలెనని ఆశపడరాదు. విరోధుని సుగుణములను గ్రహించుకొననైనను గూడదు. (వయసునందు, కులగోత్రములయందు, భాగ్యమునందు, విద్యయందు, పరువు మర్యాదలయందు) నీతో సరిసమానులు కాని వారితో స్నేహముచేయఁగూడదు. భాగ్యముపోయి పేదరికము వచ్చినప్పుడు చుట్టములు సహాయమును గోరఁగూడదు.

క॥ పరసతుల గోష్ఠి నుండిన
పురుషుఁడు గాంగేయుఁడైన • భువినిందపడున్
గరిత సుశీలయె యైనను
బరసంగతినున్న నింద • పాలగు సుమతీ॥ 3

టీక॥ సుమతీ, భువిన్=భూలోకమునందు, పరసతులగోష్ఠిన్=ఇతరుల యాఁడువాండ్రదగ్గఱ, ఉండిన= పురుషుఁడు=ఉన్న మగవాఁడు, గాంగేయుఁడైనన్=భీష్ముఁడైనను, నిందపడును=అప్రతిష్ఠపాలగును. గరిత=ఆఁడది, సుశీలయె యైనను=మంచిప్రవర్తనకలదైయైనను, పరసంగతినున్నన్=పరపురుషులయొద్దనుండినయెడల, నిందపాలగున్=అప్రతిష్ఠ పేరుచెందును.

తాత్ప॥ బ్రహ్మచారులలోనెల్ల గొప్పవాఁడగు భీష్ముఁడంతివాఁడైనను పరస్త్రీలతోఁ జనవుగ నుండినచోఁ జెడుపేరు రాకమానదు. అట్లే ఎంతమంచి నడవడికగల స్త్రీయైనను పరపురుషులతోఁ జనవుగనున్నచోఁ జెడుపేరు రాకమానదు.

వి॥ భీష్ముఁడు శంతనమహారాజునకు గంగాదేవియందుఁ బుట్టిన కుమారుఁడు. తండ్రి మత్స్యగంధియను నొక చిన్నదానిని బెండ్లాడఁగోరెను. ఆమె తండ్రి భీష్ముఁడు తాను బ్రహ్మచారిగనుండి, రాజ్యము మత్స్యగంధికిఁ బుట్టు

కుమారునకిచ్చెదనని వాగ్దానము చేసినతరువాత మత్స్యగంధిని శంతనునకిచ్చి వివాహముచేసెను. కనుక భీష్ముఁడు వివాహమును తనరాజ్యమునుగూడ వదులుకొని ప్రసిద్ధిఁజెందెను. ఈయన గంగయొక్క కుమారుఁడు గనుక గాంగేయుఁడనియుఁ బిలువఁబడును. భీష్మప్రతిజ్ఞ కాదకి యీభీష్ముని పేరటనే పిలువఁబడుచున్నది.

క॥ పాలసునకైన యాపద
జాలింబడి తీర్పఁదగదు ♦ సర్వజ్ఞునకున్
దేలగ్నిఁ బడఁగఁబట్టిన
మేలెఱుఁగునె మీఁటుఁగాక ♦ మేదిని సుమతీ. 74

టీ॥ సుమతీ, సర్వజ్ఞునకున్=తెలిసినవానికి, పాలసునకున్, అయిన=దుర్మార్గునకు సంభవించిన, ఆపద=కష్టము, జాలిన్ పడి=జాలిఁజెంది, తీర్పన్, తగదు=తప్పింపఁగూడదు. తేలు, అగ్నిన్ పడఁగన్, పట్టినన్=తేలు, నిప్పులో, పడుచుండగా, (తప్పింతమని దానిని) పట్టుకొనినయెడల, మీఁటున్ కాక = కుట్టనేకుట్టునుగాని, మేలు, ఎఱుఁగునె? = (మనము చేయఁబోయిన) ఉపకారమును తెలిసికొనునా?

తాత్ప॥ నిప్పులో పడఁబోవుచున్న తేలును తప్పింతమని పట్టుకొన్నయెడల కుట్టనేకుట్టునుగాని ఉపకారము కనిపెట్టదు. అట్లే దుర్మార్గునకాపదలో సహాయము చేయఁబోయితిమేని వాని దుర్మార్గమే కనఁబఱచునుగాని కృతజ్ఞతఁ జూపఁడు. కనుక దుర్మార్గుల కుపకారము చేయఁగూడదు.

కం. పురికిని ప్రాణము కోమటి
వరికిని ప్రాణంబు నీరు - వసుమతిలోనన్
గరికిని ప్రాణము తొండము
సిరికిని ప్రాణంబు మగువ ♦ సిద్ధము సుమతీ. 75

టీక॥ సుమతీ, పురికిని=గ్రామమునకు, కోమటి=వర్తకుఁడు ప్రాణము. వసుమతిలోనన్=భూమియందు, వరికిని=వరిపైరునకు, నీరు=నీళ్ళు, ప్రాణము.

కరికిని=ఏనుఁగునకు, తొండము, ప్రాణము. సిరికిని=భాగ్యమునకు, మగువ = ఆఁడుది, ప్రాణము. సిద్ధము=ఇది యదార్థము.

తాత్పర్యము సులభము.

విశే॥ ప్రాణము అనఁగా జంతువులకు ప్రాణము ఎంత అవసరమో అంత అవసరమగునవి.

క. పెట్టిన దినముల లోపల
నట్టడవులకైన వచ్చు నానార్థంబుల్
బెట్టని దినములఁ గనకపు
గట్టెక్కిన నేమిలేదు - గదరా సుమతీ. 76

టీక॥ సుమతీ, పెట్టిన దినములలోపలన్=(పూర్వజన్మమున ఎవరికైనను దానధర్మములను చేసికొనియున్నచో) ఎన్ని దినములపాటు పెట్టియుండిరో అన్ని దినములును. నానార్థంబుల్=సమస్తవస్తువులును, నట్టడవులకైనన్ = అడవుల మధ్యప్రదేశములకైనను, వచ్చున్=వచ్చును. పెట్టనిదినములన్=ఎన్ని దినములపాటు పెట్టియుండరో అన్ని దినములును, కనకపుగట్టు = బంగారుకొండ (మేరుపర్వతము) ఎక్కినన్=ఎక్కి కూర్చొనినను, ఏమిలేదుగదా=ఏమియు లాభము లేదుసుమా.

తాత్ప॥ ఎన్ని దినములు పూర్వజన్మమునందు ఇతరులకు అన్నవస్త్రాదుల నిచ్చితిమో అన్ని దినములనుఈ జన్మమున ఎచటనున్నను మనకును అన్నవస్త్రాదులు దొరకుచునే యుండును. అట్లే ఎన్ని దినములపాటు క్రిందటి జన్మముల యందితరులకు పెట్టియుండమో అన్ని దినములును ఈ జన్మమున ఎంత ప్రయత్నము చేసినను ఏమియు దొరకవు.

విశే॥ ఈ పద్యము చిన్నపిల్లలకెంత చెప్పినను అర్థముకాదు.

క. బంగారు కుదువఁబెట్టకు
సంగరమునఁ బాఱిపోకు • సరసుఁడవైనన్

అంగడి వెచ్చములాడకు
వెంగలితోఁ జెలిమివలదు • వినరా సుమతీ. 77

టీక॥ సుమతీ, బంగారు కుదువఁబెట్టకు = బంగారమును తాకట్టుగాఁ బెట్టకుము. సంగరమునన్ = యుద్ధమునందు, పాఱిపోకు. పరునుఁడవైనన్ = మంచిచెడ్డలు తెలిసికొనఁగలవాఁడవైనను, అంగడిన్ = కోమటికొట్టులో, వెచ్చములాడకు = పద్దువెట్టిపోకుము. అనఁగా పద్దువ్రాసి వస్తువులను తీసికొనిరాకుము. వెంగలితోన్ = మోటవానితో, చెలిమివలదు = స్నేహముచేయవద్దు. వినరా.

తా॥ బంగారమును కుదువఁబెట్టరాదు. యుద్ధముచేయుచు పాఱిపోరాదు. కోమటివద్ద పద్దువ్రాసి వస్తువులను దెచ్చుకోరాదు. మోటవానితో సహవాసము చేయవద్దు.

విశే॥ బంగారమని చెప్పినచోట, విలువగల యేవస్తువునైనను కుదువ పెట్టరాదనియు, అంగడివెచ్చములనినచోట, కోమటిమాత్రమే కాక పరుతకఁ చేయుచుండు ఎవరివద్దనైనను అనియు అర్థముచేసికోవలెను.

క. బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి • పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలిచీమల చేతఁజిక్కి • చావదె సుమతీ. 78

టీక॥ సుమతీ, పలువురతో = అనేకులతో, నిగ్రహించి = విరోధముపెట్టుకొని, బలవంతుఁడన్ నాకు, ఏమి, అని = నేను బలముకలవాఁడను, నాకేమిభయముఅని, పలుకుట మేలా? = చెప్పుట మంచిదా? ఏలయన, బలవంతమైన సర్పము = బలవంతముగలపాము, చలిచీమలచేతన్ చిక్కి = చలిచీమలచేతిలోఁ జిట్టువడి, చావదె = చనిపోవుచుండలేదా?

తా॥ పెద్ద బలముగలపాము మిగుల చిన్నవగు చలిచీమలచేతిలోఁ జచ్చినట్లే, బలవంతుఁడను గదాయని గర్వించి చాల నసేకులతో వైరము నడఁగిం చెదరు.

క. మాటకుఁ బ్రాణము సత్యము
కోటకుఁ బ్రాణంబు సుభట • కోటి ధరిత్రిన్
బోటికిఁ బ్రాణము మానము
చీటికిఁ బ్రాణంబు వ్రాలు • సిద్ధము సుమతీ. 79

టీక॥ సుమతీ, మాటకున్=మాటలాడునట్టిగాని వ్రాయునట్టిగాని మాటకు, సత్యము=యథార్థము, ప్రాణము. ధరిత్రిన్=భూమిలో, కోటకున్=కాపాడుచుండు కోటకు, సు=దిట్టమైన, భటకోటి=భటులయొక్క సమూహము, ప్రాణంబు. బోటికిన్=స్త్రీకి, మానము=సిగ్గు ప్రాణము. చీటికిన్=వ్రాసిన కాగితమునకు, వ్రాలు=సంతకము, ప్రాణంబు. సిద్ధము=ఇది నిశ్చయము.

తా॥ నిజముకానిమాట చెల్లదు. భటులులేనికోట క్షేమముగనుండదు. సిగ్గులేనియాఁడుది ప్రాణములేని దానితో సమానము. సంతకములేని కాగితము చెల్లదు. జంతువులకుఁ బ్రాణ మెంతముఖ్యమో ఇవియును అంతముఖ్యములు.

క. వరిపంట లేని యూరును
దొరయుండనియూరు తోడు • దొరకని తెరువున్
ధరను బతిలేని గృహమును
నరయంగా రుద్రభూమి • యనఁదగు సుమతీ. 80

టీక॥ సుమతీ, వరిపంటలేని ఊరును=వడ్లు పండనియూరును, దొరయుండనియూరు=మంచిచెడ్డల తీర్పుచెప్పఁగలవాఁడులేని యూరును, తోడు దొరకని తెరువున్=ఒంటరిగా ప్రయాణముచేయవలసివచ్చిన దారియును, ధరను=భూమియందు, పతిలేని, గృహమును=యజమానుఁడగు మగవాఁడులేని యిల్లును, అరయంగాన్=విచారించిచూడగా, రుద్రభూమి అనఁదగున్=(వీనిని) శ్మశానము అని చెప్పఁదగును.

తా॥ వరిపండని ఊరును, న్యాయముచెప్పఁగలవాఁడులేని గ్రామమును, తోడుదొరకని దారిప్రయాణము, యజమానుఁడులేని యిల్లు, ఇవి శ్మశానముతో సమానముగ భయంకరములగు చోటులు.

కం. వినఁదగు నెవ్వరు సెప్పిన
వినినంతనె వేగపడక ♦ వివరింపఁదగున్
కనికల్ల నిజము దెలిసిన
మనుజుఁడెపో నీతిపరుఁడు ♦ మహిలో సుమతీ. 81

టీక॥ సుమతీ, ఎవ్వరు చెప్పినన్ = ఎవరు ఏది చెప్పినను, వినఁదగున్ = వినవలసినది. వినినంతనె = విన్నంతమాత్రముచేతనే, వేగపడక = తొందరపడక, వివరింపన్, ఆగున్ = విచారింపవలెను. కని = విచారించిచూచి, కల్ల = అబద్ధమును, నిజమును = నిశ్చయమగు సంగతియును, తెలిసినమనుజుఁడె = తెలిసికొనిన మనుష్యుఁడే, మహిలోన్ = భూమియందు, నీతిపరుఁడుపో = నీతిగలవాఁడు సుమా.

తా॥ అనేకులు అనేక విధములుగా చెప్పుచుందురు. వారందఱును చెప్పుచుండు మాటలన్నియు ఓపికతో విని వాని అన్నిటిలోను నిజమైన విషయములేవో, అబద్ధములేవో విచారించుకొని తెలిసికొనఁగలయతఁడు, అట్లు శాంతముగా విచారించి కనుఁగొనఁగలవాఁడే నీతిపరుఁడు అనిపించుకొనును.

కం. శుభముల నొందని చదువును
నభినయమును రాగరసము ♦ నందని పాటల్
అభిలాష లేని కూటమి
సభ మెచ్చనిమాటలెల్లఁ ♦ జెప్పన సుమతీ. 82

టీక॥ సుమతీ, శుభములన్ = మేలులను, ఒందని = చెందనట్టి, చదువును, అభినయమును = ఆటయును, రాగరసము = రాగములో నుండవలసిన సొగసుఁదనము, అందనిపాటల్ = లేనట్టిపాటలును, సభమెచ్చనిమాటలు ఎల్లన్ = సభలో నుండువారు బాగున్నవని అననిమాటలన్నియును, చప్పన = రుచిలేనివి.

తాత్పర్యము॥ లాభించిన దనుక, ఆనందము కలుగఁజేయని పాట, సభలో నుండి వినువారలందఱును మెచ్చని మాటలు, ఎన్నియు వ్యర్థములైనవి.

కం॥ సరసము విరసము కొఱకే
పరిపూర్ణసుఖంబు లధిక ♦ బాధలకొఱకే
పెరుగుట విఱుగుట కొఱకే
ధరతగ్గుట హెచ్చుకొఱకె ♦ తథ్యము సుమతీ. 83

టీక॥ సుమతీ, సరసము=పరిహాసాదికము నాడుకొనుట, విరసముకొఱకే=ఎన్నటికైనను ఆవేశములు చెడగొట్టుటకేసుమా. పరిపూర్ణసుఖంబులు=సంపూర్ణముగా సౌఖ్యము ననుభవించుటలు, అధికబాధలకొఱకే=ఎన్నటికైనను ఎక్కువగా కష్టము ననుభవించుటకొఱకేసుమా, పెరుగుట=ఎక్కువగుట, విఱుగుట కొఱకే=చెడిపోవుటకొఱకేసుమా. ధరతగ్గుట=వెలతక్కువగుట, హెచ్చుకొఱకె=ఎక్కువగుటకొఱకేసుమా. తథ్యము=నిశ్చయము.

తాత్పర్యము॥ పరిహాసములాడుకొనుట ఆవేశములు తగ్గుటకే కారణమగును. విశేషముగా సౌఖ్యములనుభవించుట ఎక్కువగా కష్టము ననుభవించుటకే కారణమగును. ఏదైనను విశేషముగా ఎక్కువగుట, దాని నాశనముకొఱకే, వస్తువులు చవుకయగుట మరల ప్రియమగుటకొఱకేయని తెలియవలెను.

వి॥ ఈపద్యమునందు "అతిసర్వత్ర వర్జయేత్" అనఁగా ప్రతివిషయము నందును మితము తప్పినచో నష్టమునకుఁ గారణమగును నీతి బాగుగను వివరింపఁబడెను.

కం. అప్పుగొని చేయు విభవము
ముప్పునఁ బ్రాయంపుటాలు ♦ మూర్ఖునితపముం
దప్పరయని నృపురాజ్యము
దెప్పరమై మీఁదఁ గీడు ♦ దెచ్చురసుమతీ. 84

టీక॥ సుమతీ, అప్పు, కొని, చేయు = అప్పుతీసికొనివచ్చి చేయునట్టి, విభవమున్ = వేడుకయును, ముప్పునన్ = ముసలితనమునందు, ప్రాయంపు,

ఆలున్ = పడుచుదియగు భార్యయును. మూర్ఖుని = తెలివిలేనివానిదగు, తపమున్ = తపస్సుయును, తప్పు = నేరమును, అరయని = విచారింపని, నృప = రాజుయొక్క, రాజ్యమున్ = రాజ్యమును, దెప్పరము, (వి = ముందు) భరించుటకు శక్యముకానివై, మీఁదన్ = ముందుముందు, కీడు = కీడు. తెచ్చున్ = కీడును గలిగించునుసుమీ.

తాత్పర్యము. అప్పుచేసి అనుభవించు వేడుకలు, ముసలితనమున కాపురమునకువచ్చు పడుచుభార్య, తెలివితక్కువవాఁడు చేయుతపస్సు. నేరములు విచారింపని రాజుయొక్క రాజ్యము, ఇవి కాలక్రమమున పెరిగి పెరిగి తుదకు కీడు తెచ్చితీరును.

నీతి. అప్పుకొనిచేయు విభవములకు వివాహాదులయందలి యనవసరవ్యయములను బోధింపవలెను. ముప్పునఁ బ్రాయంపుటాలు ముసలితనమున సంపాదనము తగ్గిపోవుననియు, పడుచుపెండ్లమునకు సొమ్ములమీఁదను, నగలమీఁదను, చీరలమీఁదను, కోరికలు పుట్టుచుండుననియు, ఆకోరికలను దీర్చుటకు చాలినంతడబ్బు సంపాదింపలేకపోవుటచేతఁ జిక్కులుపడుచుండుననియు, తనకుఁ గావలసిన వస్తువులు దెచ్చిపెట్టలేకపోవుటచేత భార్యకు భర్తపై ననురాగము పుట్టదనియు, ఇట్లు అనురాగముచెడిచెడి భర్తమంచమెక్కుట మొదలగు చిక్కులలోఁ బడినయెడల తగిన యుపచారములు భార్యజరుపదనియు, ఇటువంటి విషయములను బోధింపవలెను. కామసంబంధములగు విషయములు చిన్నపిల్లలకు బోధింపఁగూడదు.

బోధింపరాని పద్యములు

క. ఆఁకలి యుడుగని కడుపును
వేఁకటియగు లంజెపడుపు ♦ విడువని బ్రతుకున్

ప్రాఁకొన్న నూతి యుదకము
మేఁకల పాడియును రోఁత ♦ మేదిని సుమతీ. 85

టీ॥ సుమతీ, ఆఁకలి, ఉడుగని=ఆఁకలి, తీరని, కుడుపును=భోజనమును, ప్రాఁకొన్న=ప్రాఁచిపట్టియున్న, నూతి, యుదకమును, మేఁకలపాడియును, మేదినిన్=భూమియందు, రోఁతగ=అసహ్యకరములైనవి.

తా॥ సులభము.

క. ఉదకము ద్రావెడు హయమును
మదమున నుప్పొంగుచుండు ♦ మత్తేభంబున్
మొదవుకడనున్న వృషభము
చదువనియా నీచుకడకుఁ ♦ జనకుర సుమతీ. 86

టీ॥ సుమతీ, హయము=గుఱ్ఱము, ఉదకము=నీరు, మత్తేభము=మత్త ఇభము=ఏనుఁగు, మొదవు=ఆవు.

విశే॥ తాత్పర్యముగాని యింతకంటె టీకగాని యీ పద్యమునకుఁ జెప్పఁగూడదు.

క. కడుబలవంతుండైనను
బుడమిని బ్రాయంపుటాలిఁ ♦ బుట్టిన యింటం
దడవుండనిచ్చెనేనియుఁ
బడుపుఁగ నంగడికిఁ దానె ♦ పంపుట సుమతీ. 87

టీ॥ సుమతీ, పుడమినిన్=భూమియందు, ప్రాయము=ఈడు, ఆలిన్=భార్యను, తడవు=చాలకాలమువఱకు.

తా॥ అనవసరము.

క. కనుగాయఁ గఱచిచూచిన
మసలక తన యొగరుగాక ♦ మధురంబగునా

పసగలుగు యువతులుండఁగ
పసిబాలలఁ బొందువాఁడు • పశువుర సుమతీ. 88

టీక॥ సుమతీ, కసుగాయన్=పచ్చికాయను, కఱచి, చూచిన=కొఱికి చూచినయెడల, మసలక=తప్పకుండ, తన యొగరు గాక=తన యొగరు రుచి కాక, మధురంబు=తీపి, అగునా ?

తా॥ లేఁత కాయలను కొఱికి చూచిన నొగరుగ నుండును గాని తియ్యఁగ నుండవు.

క. కవిగానివాని వ్రాఁతయు
నవరసభావములు లేని • నాతుల వలపుం
దవిలి చను పందినేయని
వివిధాయుధ కౌశలంబు • వృథరా సుమతీ. 89

టీక॥ సుమతీ, కవిగానివాని=పండితుఁడు గానివాని యొక్క, వ్రాఁతలు=గ్రంథములును, తవిలి=ప్రయత్నము చేసి, చను=వెళ్ళుచున్న, పందిని, ఏయని=పొడువలేని, వివిధ=అనేకవిధములగు, ఆయుధ=యుద్ధము చేయు పనిముట్ల సంబంధమగు, కౌశలంబు=నేర్పరితనము, వృథగా=ఉపయోగము లేనివగును సుమా.

తా॥ పండితుఁడు కానివాఁడు వ్రాసిన పుస్తకములును, పరుగెత్తుచున్న పందిని చంపలేని ఆయుధవిద్య, నిష్ప్రయోజనము లైనవి సుమా.

క. కాదుసుమీ దుస్సంగతి
పోదుసుమీ కీర్తికాంత • పొందినపిదపన్
వాదుసుమీ యప్పిచ్చుట
లేదుసుమీ సతులవలపు • లేశము సుమతీ. 90

టీక॥ సుమతీ, దుస్సంగతి=దుష్టునితో సహవాసము, కాదుసుమీ=మంచిది కాదుసుమా, కీర్తికాంత=మంచిపేరు అను స్త్రీ, పొందినపిదపన్=వచ్చి

న తరువాత, పోదుసుమీ=వెళ్ళిపోదుసుమా, అప్పయిచ్చుట=అప్పు పెట్టుట, వాదుసుమీ=అపవాదులకు కారణమగునుసుమా, సతులకుఁ బు=స్త్రీలకు ఆపే క్ష, లేశము=కొంచెమైనను, లేదుసుమీ=ఉండదుసుమా.

తా॥ దుష్టులతో స్నేహముచేయరాదు, కీర్తివచ్చి పోదు, అప్పు పెట్టరాదు, స్త్రీలకు ఆపేక్షయుండదు.

క. కాముకుఁడు దనిసి విడిచిన
కోమలిఁ బరవిటుఁడు గవయఁ ♦ గోరుట యెల్లన్
బ్రేమమునఁ జెఱకు పిప్పికిఁ
జీమలు వెసమూఁగినట్లు ♦ సిద్ధము సుమతీ. 91

టీక॥ సుమతీ, ప్రేమమునన్=ఆపేక్షతో, చెఱకుపిప్పికిన్=చెఱకు పిప్పియందేమో రసముదొరకునని, చీమలు, వెసన్, మూఁగినట్లు=క్రమ్ముకొనినట్లు. సిద్ధము=నిజము.

తాత్ప॥ అనవసరము.

క. కొక్కోకమెల్లఁ జదివినఁ
జక్కనివాఁడైన, రాజ ♦ చంద్రుండైనన్
మిక్కిలి రొక్కములీయక
చిక్కదురా వారకాంత ♦ సిద్ధము సుమతీ. 92

వి॥ ఈ పద్యము బోధింపరాదు.

క. కోమలి విశ్వాసంబును
పాములతోఁ జెలిమి యున్న ♦ భామలవలపున్
వేముల తీయఁదనంబును
భూమీశుల నమ్మికలును ♦ బొంకుర సుమతీ. 93

టీక॥ సుమతీ, కోమలివిశ్వాసంబును=ఆఁడుదాని నమ్మకమును, పాములతోన్ చెలిమి=పాములతో సహవాసమును, వేములతీయఁదనంబును=వేప

చెట్టునందు తియ్యఁదనమును, భూవిభులు=రాజులయొక్క, నమ్మికలును=నమ్మకములును, బొంకుర=అబద్ధములుమా.

తా॥ స్త్రీలయొక్క విశ్వాసమును, పాముల స్నేహమును, వేఁపచెట్ల యందు తియ్యఁదనమును, రాజుల నమ్మకమును, ఇవి అబద్ధములు.

క. గడనగల మగనిఁజూచిన
నడుగులకును మడుఁగులిడుదు • రతివలు తమలో
గడనుడుగు మగనిఁజూచిన
నడపీనుగువచ్చెననుచు • నగుదురు సుమతీ. 94

టీక॥ సుమతీ, అతివలు=స్త్రీలు, గడనగల మగనిన్=ద్రవ్యసంపాదించునట్టి పెనిమిటిని, చూచినన్=చూచినపుడు, అడుగులకును మడుఁగులిడుదురు=ఎక్కువగా మర్యాదచేయుదురు. గడన. ఉడుగు, మగనిన్, చూచినన్=సంపాదనమును మానిన పెనిమిటిని జూచినపుడు, నడపీనుఁగువచ్చెననుచున్=మొండిపీనుఁగు వచ్చినాఁడని చెప్పుచు, నగుదురు=పరిహాసము చేయుదురు.

తా॥ స్త్రీలు, సంపాదనగల మగనిచూచిన ఎంతో మర్యాదలు చేయుదురు. సంపాదనలేని మగనిజూచినచో పరిహాసముచేసి లక్ష్యము చేయరు.

క. తమలముసేయని నోరును
రమణుల చనుమొనలమీఁద • రాయనిమేనున్
కమలములులేని కొలఁకును
హిమధాముఁడులేనిరాత్రి • హీనము సుమతీ. 95

టీక॥ సుమతీ, తమలముచేయని=తాంబూలము వేసికొనని, నోరును, కమలములులేని, కొలఁకును=చెఱువును, హిమధాముఁడు=చంద్రుఁడు, లేనిరాత్రి, ఇవి హీనము (లు)=గౌరవము లేనివి.

తా॥ తాంబూలము వేసికొనని నోరును, కమలములులేని చెఱువును, చంద్రుఁడులేని రాత్రియు, అందముగ నుండవు.

కం. తలపొడుగు ధనముఁ బోసిన
వెలయాలికి నిజము లేదు ♦ వివరింపంగాఁ
దలదడివి బాసఁ జేసిన
వెలయాలిని నమ్మరాదు ♦ వినురా సుమతీ. 96

టీక॥ సుమతీ, తలపొడుగునకు నచ్చునట్లు, ధనమున్, పోసినన్ = దప్పళుప్పపోసినను, వెలయాలికిన్ = భోగముదానికి, నిజము లేదు = నమ్మకమగు ప్రవర్తనము లేదు. తలదడివి = తలమీద చెయ్యి పెట్టి. బాసన్ = ప్రమాణమును. చేసినను, వెలయాలిన్, నమ్మరాదు, వినుగా.

తాత్ప॥ ఎంతడబ్బు యిచ్చినను, భోగముదాని ప్రవర్తన సరిగా నుండదు. ఎంత ఘోరప్రమాణము చేయించి చెప్పించినను నిజము చెప్పదు.

కం. తలమాసిన నొలుమాసిన
వలువలు మాసినను బ్రాణ ♦ వల్లభు నైనన్
కులకాంతలైన రోఁతురు
తిలకింపఁగ భూమిలోనఁ ♦ దిరముగ సుమతీ. 97

టీక సుమతీ, భూమిలోనన్ = ప్రపంచమునందు, తిరముగన్ = ఎప్పటికైనను, ప్రాణవల్లభునైనన్ = మగనినైనను, కులకాంతలైనన్ = చేసికొన్న భార్యలైనను, తలమాసినన్ = వెంట్రుకలు ముఱికిగా నున్నను, వలువలు = బట్టలు, మాసినన్ = మాసియున్నను, తిలకింపఁగన్ = చూచుటకైనను, రోఁతురు = అసహ్యించుకొందురు.

తాత్ప॥ పరిశుభ్రముగ నుండకుండ మట్టిగనుండు పురుషులను భార్యలు కూడ అసహ్యించుకొందురు.

కం. ఒరునాత్మఁ దలఁచు సతి విడు
మఱుమాటలు పలుకు సుతుల ♦ మన్నింపకుమీ

వెఱపెఱుఁగని భటు నేలకు
తలఁచుగ సతిఁ గవయుఁబోకు • తగదుర సుమతీ. 98

టీక. సుమతీ, మఱుమాటలు=ఎదిరించి పలుకు మాటలు. పలుకు సుతు లన్ = మాటలాడు కుమారులను, మన్నింపకుమీ = గౌరవము చేయవద్దుసుమా. వెఱపు=భయము, ఎఱుఁగని=తెలిసికొనలేని, భటులను=సేవకులను, ఏలకు=(ఉద్యోగములో పెట్టుకొనకు అధికారములో నుంచుకొనకుము).

తాత్ప॥ ఎదిరించిమాటలాడు కుమారులను గౌరవింపవద్దు. అనఁగా శిక్షింపవలెను. తప్పుచేసినయెడల శిక్షింతురేమోయను భయములేని సేవకులకుద్యోగములియ్యవద్దు.

కం. పరుల కనిష్టము సెప్పకు
పొరుగిండ్లకుఁ బనులు లేక • పోవకు మెపుడున్
పరుఁ గవిసిన సతిఁ గవయకు
మెఱిఁగియు బిఱుసైన హయము • నెక్కకు సుమతీ. 99

టీక॥ సుమతీ, పరులకున్=ఇతరులకు. అనిష్టము=ఇష్టము కానిమాటను, చెప్పకు. పొరుగిండ్లకున్=ఇతరులయిండ్లకు, ఎపుడున్=ఎప్పుడును. పనులు లేక, పోవకు=వెళ్ళవద్దు. ఎఱిఁగియున్=తెలిసియుండియును, బిఱుసు. ఐన, హయమున్=పారిపోవునదైన గుఱ్ఱమును, ఎక్కకు=ఎక్కవద్దు.

తాత్ప॥ ఇతరులకుఁ గష్టముతోఁచు మాటలు చెప్పవద్దు. పనిలేక యితరుల యిండ్లకు వెళ్లవద్దు. పారిపోవు గుఱ్ఱము నెక్కవద్దు.

కం. పర్వముల సతులఁ గవయకు
ముర్వీశ్వరు కరుణ నమ్మి • యుబ్బకు మదిలో
గర్వింపఁ నాలి బెంచకు
నిర్వాహము లేనిచోట • నిలువకు సుమతీ. 100

టీక॥ పర్వములు=పండుగదినములు. సుమతీ, ఉర్వీశ్వరుని = (ఉర్వి, ఈశ్వరు) రాజుయొక్క, కరుణన్ = దయను, నమ్మి, మదిలోన్=మనస్సునందు

నమ్మకు = గర్వింపకు. అలికిన్ = భార్యను, గర్వింపన్ = గర్వించునట్లు, పెంచకు = పెంచకుము. నిర్వాహము లేనిచోటన్ = సంపాదనము దొరకనిచోట, నిలువకు = ఉండవద్దు.

తాత్ప॥ రాజులు ప్రేమచూపినాని గర్వింపఁగూడదు. స్త్రీలు గర్వించునట్లు వారిని వదలరాదు. జరుగుబాటు లేనిచోటఁ గాఁపురముండరాదు.

కం. పలుదోమి సేయువిడియము
తలకడిగిననాఁటి నిద్ర • తరుణులతోడన్
బొలయలుకనాఁటి కూటమి
వెలయింతని చెప్పరాదు • వినరా సుమతీ. 101

టీక॥ సుమతి, పలుతోమి = ముఖము కడుగుకొనిన వెంటనే, సేయు విడియము = వేసికొను తాంబూలమును, తలకడిగిన నాఁటినిద్ర = తలంటిస్నానము చేసిననాఁటిరాత్రి పట్టెడునిద్దుర, దానికి వెలయింతని చెప్పరాదు. వినరా = విను ఇంత వెలకలదని చెప్పుటకు వీలు లేదురా.

తాత్పర్యము. సులభము.

క. పాటెఱుఁగని పతికొలువును
గూటంబున నెఱుకపడని • కోమలి రతియున్
జేటెత్తఁ జేయు చెలిమియు
నేటికి నెదురీఁదినట్లు • లెంచుము సుమతీ॥ 102

టీక॥ సుమతీ, పాటు = కష్టము, ఎఱుఁగని = తెలిసికొనఁజాలని, పతి = యజమానుని యొక్క, కొలువును = ఉద్యోగమును, పేటు, ఎత్తన్ చేయు = వినోదమును గలుఁగఁజేయు, చెలిమియున్ = స్నేహితమును, వీనిని, ఏటికిన్ = నదీప్రవాహమునకు, ఎదురు, ఈఁదినట్లులు, ఎంచుము = ఎదురీఁదినట్లుగాఁ దలఁచుకొనుము.

తాత్ప॥ నదీ ప్రవాహమున నెదురీఁదుట ఎంతకష్టమో, కష్టము కనిపెట్టఁజాలని యజమాని సేవించుటయు, నిలువఁజాలని స్నేహితమును అంతకష్టములు.

కం. పిలువని పనులకుఁ బోవుట
కలయని సతిరతియు, రాజు ♦ కానని కొలువున్
బిలువని పేరంటంబును
వలవని చెలిమియునుఁ జేయ ♦ వలదుర సుమతీ. 103

టీక. సుమతీ, పిలువని పనులకున్ = యజమాని పిలువనిదే ఏపనులకైనను, పోవుట, రాజు=యజమానుఁడు, కానని=కనిపెట్టని, కొలువున్=ఉద్యోగమును, పిలువని పేరంటంబును=పేరంటమునకు ఎవరును రమ్మని పిలువకుండఁగనే వెళ్ళుటయు, వలవని=ప్రేమలేని, చెలిమియున్=స్నేహమును, చేయవలదు=చేయవద్దు.

తా॥ పిలువని పనులకు, పేరంటమునకు పోరాదు. ప్రేమలేని స్నేహము చేయరాదు.

క. పులిపాలు దెచ్చియిచ్చిన
నలవడఁగా గుండెఁగోసి ♦ యఱచేనిడినన్
దలపొడుగు ధనముఁ బోసిన
వెలయాలికిఁ గూర్మిలేదు ♦ వినురా సుమతీ. 104

టీక॥ సుమతీ, పులిపాలు, తెచ్చి, యిచ్చినన్=పెద్దపులిపాలు పితికొని వచ్చి యిచ్చినను, అలవడఁగాన్=ఉపాయముగా, గుండెన్=గుండెకాయను, కోసి అఱచేన్ ఇడినన్=చేతిలోఁ బెట్టినను, తలపొడుగు=మనిషి ఎంతపొడుగుండునో అంతఎత్తునను, ధనముపోసినన్=డబ్బుకుప్పపోసినను, వెలయాలికిన్=భోగముదానికి, కూర్మిలేదు, వినరా=ప్రేమయుండదు సుమా.

తా॥ పులిపాలు తెచ్చియిచ్చినప్పటికి, గుండెకోసి చేతిలోఁబెట్టినప్పటికి, మనిషి మానుగున్నట్లు డబ్బు కుప్పపోసినప్పటికి, ఇంకను నిటువంటి కష్టములగు పనులెన్నియైనఁ జేసినప్పటికి, భోగముదానికిమాత్రము ప్రేమపుట్టదు.

కం. వలపింత సతికిఁ బుట్టక
బలిమిని దమకించి విటుఁడు ♦ పైకొనుచెల్లన్

మలయజము పానవిూఁదను
జలమంచక తీసినట్టి ♦ చందము సుమతీ. 105

టీక॥ సుమతీ, పానవిూఁదను, మలయజము = గంధము, జలమంచక = నీళ్ళువేయక, తీసినట్టి చందము.

క. విడెము సేయని నోరును
చేడెల యధరామృతంబుఁ ♦ జెందనినోరున్
పాడంగ రాని నోరును
బూడిద కిరవైన పాడు ♦ బొందర సుమతీ. 106

టీ॥ సుమతీ, విడెముచేయని = తాంబూలము వేసికొనని, నోరును, పాడంగ, రాని = పాడుటకు చేతకాని, నోరును, బూడిదకు, ఇరవు, ఐన = ఉండుటకు తగిన, పాడుబొందర = పాడుపడిన కుటమేసుమా.

తాత్ప॥ తాంబూలము వేసికొనని, నోరును, పాడలేనినోరును, బూడిద పోయు పాడుగుంటలవలె పనికిమాలినవగును.

క. వెలయాలివలనఁ గూరిమి
గలుగదు మఱి కలిగెనేని ♦ కడతేఱదుగా
బలువురు నడచెడు తెరువునఁ
బులు మొలవదు, మొలచెనేని ♦ పొదలదు సుమతీ. 107

టీక॥ వెలయాలు = భోగముది. కూరిమి = ప్రేమ. సుమతీ, పలువురు = అనేకులు, నడచెడు, తెరువునన్ = దారియందు, పులు = గడ్డి, మొలవదు = పుట్టదు, మొలచెనేని = ఒకవేళ మొలచినను, పొదలదు = వృద్ధిపొందదు.

తాత్ప॥ నడిచే దారిలో గడ్డిమొలవనే మొలవదు. ఒకవేళ మొలచినను పెరుగదు.

కం. వెలయాలు సేయు బాసలు
వెలయఁగ నగసాలిపొందు ♦ వెలమ చెలిమియున్

గలలోనఁ గన్న కలిమియు
విలసితముగ నమ్మరాదు ♦ వినరా సుమతీ. 108

టీక॥ సుమతీ, వెలయాలు=భోగముది, చేయు, బాసలు=ప్రమాణముల ను, వెలయఁగన్=ఒప్పునట్లు, అగసాలిపొందు=కమసాలివానితో సహవాసము, వెలమచెలిమియున్=వెలమవానితోడి స్నేహమును, కలలోనన్, కన్న, కలిమియును=కలలోఁ జూచిన భాగ్యమును, విలసితముగన్=ప్రసిద్ధముగ, నమ్మరాదు=నిశ్చయముగ నమ్మఁగోరాదు. వినరా.

తాత్ప॥ భోగముదాని ప్రమాణములు. కమసాలివానితో, వెలమవాని తోఁ జేయు స్నేహములు, కలలోఁ గనఁబడిన డబ్బు ఇవి నిశ్చయముగ నమ్మరాదు.

క. మదినొకని వలచియుండఁగ
మదిచెడి యొక క్రూరవిటుఁడు ♦ మానక తిరుగున్
అది చిలుకఁ బిల్లి పట్టినఁ
జదువునె యాపంజరమున ♦ జగతిని సుమతీ. 109

టీక॥ సుమతీ, అది, చిలుకన్=చిలుకను, పిల్లి, పట్టినన్=పట్టుకొనిన యెడల, జగతిని=భూమియందు, ఆపంజరమునన్=ఆచిలుక యున్న పంజరమున, చదువునె=మాటలను చదువుచుండునా?

తాత్ప॥ అనవసరము.

13481